


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 21, పేజీలు - 08

శుక్రవారం, మే 17, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## అటు అసెంబ్లీ.. ఇటు పార్లమెంట్

### - దేన్నీ వదలని నేతలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అధికారమనేది ఒక మత్తు లాంటిది. దానికి అలవాటు పడ్డవారు దూరంగా జరగలేరు. ఏదో ఒక రూపంలో అధికారాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు పైగా మన సమాజం అధికారంలో ఉన్న నాయకులకే విలువ ఇస్తుంది. ఒకవేళ అధికారానికి దూరంగా ఉంటే ఆ నాయకులను సమాజం కూడా దూరం పెడుతుంది. ఇక కార్యకర్తల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బెల్లం ఉన్నప్పుడే ఈగలు వాలినట్టు అధికారం ఉన్నప్పుడే కార్యకర్తలు, నాయకులు, ఇతర అధికారులు చుట్టూ ఉంటారు. అదే కోల్పోతే దూరం జరుగుతారు. అధికారం పోతే దాని పర్యవసనాలు ఎలా ఉంటాయో నాయకులు తెలుసు కాబట్టి దాన్ని కాపాడుకునేందుకు రకరకాల జిమ్మిక్కులు చేస్తుంటారు. తెలంగాణ రాష్ట్రంలో సరిగ్గా ఐదు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి అయితే ఈ రెండు ఎన్నికల్లో కొంతమంది ప్రజాప్రతినిధులు పోటీ చేశారు. ఇంతకీ వారు ఎందుకు పోటీ చేశారు, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో వారి పరిస్థితి ఏమిటి, ఒకసారి పరిశీలిస్తే..

#### ఈటల రాజేందర్

భారత రాష్ట్ర సమితి నుంచి బయటికి వచ్చిన తర్వాత ఈటల రాజేందర్ భారతీయ జనతా పార్టీలో చేరారు. హుజురాబాద్ స్థానం నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్ తో పాటు మాజీ సీఎం కేసీఆర్ పై గజ్వేల్ స్థానంలో పోటీ చేశారు. అటు గజ్వేల్ తో పాటు ఇటు హుజురాబాద్ లోనూ ఈటల రాజేందర్ ఓడిపోయారు. దీంతో తన రాజకీయ భవితవ్యాన్ని కాపాడుకునేందుకు దేశంలోని అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజ్ గిరి నుంచి పోటీ చేశారు. ఆయనకు ప్రత్యర్థులుగా భారత రాష్ట్ర సమితి నుంచి రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి సునీతా మహేందర్ రెడ్డి పోటీ చేశారు. అయితే ఈ పోటీలో తాను విజయం సాధిస్తానని ఈటల రాజేందర్ ధైర్యంగా ఉన్నారు.

#### బండి సంజయ్..

బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2019 ఎన్నికల్లో ఆయన భారత రాష్ట్ర సమితి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ పై అద్భుతమైన విజయాన్ని సాధించారు. ఆ తర్వాత ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుంచి పోటీ చేసినప్పటికీ ఓడిపోయారు. ఈసారి కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి మళ్లీ పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో ప్రత్యర్థిగా ఉన్న బోయినపల్లి వినోద్ కుమార్ భారత రాష్ట్ర సమితి నుంచి పోటీ చేశారు. ఈసారి



కాంగ్రెస్ పార్టీ నుంచి వెలిచాల రాజేందర్ రావు కూడా పోటీ చేశారు. గత ఎన్నికల్లో ద్విముఖ పోరు ఉంటే ఈసారి త్రిముఖ పోరు ఉంది. అయితే ఈ ఎన్నికల్లో తాను విజయం సాధిస్తానని బండి సంజయ్ గట్టి నమ్మకంతో ఉన్నారు.

6లో ▶

## కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో మరో ఊరట



### - ఈడీకి మరో షాక్

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ అరెస్టు తర్వాత తీహార్ లో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు సుప్రీంకోర్టు తాజాగా లోక్ సభ ఎన్నికల ప్రచారం చేసుకునేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. సీఎంగా ఎలాంటి విధులు నిర్వర్తించకూడదనే షరతుతో ఆయనకు బెయిల్ ఇచ్చింది. దీనిపై ఇప్పటికే బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇలాంటి తరుణంలో కేజ్రీవాల్ ప్రచారంలో చేసిన ఓ వ్యాఖ్య ఆధారంగా ఆయన బెయిల్ రద్దు కోరుతూ సుప్రీంను ఆశ్రయించిన ఈడీకి చుక్కెదురైంది. తాను తిరిగి జైలుకు వెళ్లకుండా ఉండాలంటే ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటేయాలంటూ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా ఆయనకు గతంలో మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ రద్దు చేయాలంటూ ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. అయితే సుప్రీంకోర్టు ఈ వాదనను తోసిపుచ్చింది. అది అతని సొంత అభిప్రాయం అయి ఉండొచ్చని పేర్కొంది. కేజ్రీవాల్ వ్యాఖ్యలు ఆయన బెయిల్ షరతుల ఉల్లంఘనే అంటూ ఈడీ చేసిన వాదనతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకీభవించలేదు. కేజ్రీవాల్ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని, దీనిపై తాము చెప్పేదేమీ లేదని తెలిపింది. అలాగే తాము గతంలో

6లో ▶

## ఆపరేషన్ కరెంట్ షురూ

### - రంగంలోకి కమిషన్, బహిరంగ ప్రకటన

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఎన్నికల సమరం ముగిసింది. ఇక ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ సర్కార్ చేసిన అవినీతిని బయటకు తీయటమే టార్గెట్‌గా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్క డిపార్ట్‌మెంట్ మీద దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఏర్పడగానే ఒక్కో శాఖపై ఆరా తీసిన సీఎం రేవంత్ రెడ్డి వాటిపై అసెంబ్లీలో శ్వేత పత్రాలు కూడా ప్రవేశపెట్టారు. ఈ క్రమంలోనే విద్యుత్ శాఖలో జరిగిన అవతవకలపై విచారణ చేసేందుకు ఓ



కమిషన్ వేసింది రేవంత్ రెడ్డి సర్కార్. అయితే లోక్ సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో విచారణ కొంచెం ఆలస్యమైంది. ఇప్పుడు ఎన్నికలు ముగియటంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ కమిషన్ రంగంలోకి దిగింది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంతో పాటు ఛత్తీస్గఢ్తో చేసుకున్న పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లలో అవకతవకలపై ఈ కమిషన్ విచారణ ప్రారంభించింది. 2014 నుంచి జరిగిన విద్యుత్ కొనుగోళ్లు, థర్మల్ పవర్ ప్లాంట్ల

6లో ▶

## కీలక అధికారులపై ఈసీ కొరడా

### - పోలింగ్ అనంతర హింస నివారించకపోవడంపై కఠిన చర్యలు




**అమరావతి / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఏపీలో ఎన్నికల తర్వాత చోటు చేసుకున్న హింసపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఓవైపు భారీ ఓటింగ్ శాతంతో రాష్ట్రంలో ఓటర్లు తమ చైతన్యాన్ని చాటుకుంటే ఎన్నికల హింసతో రాజకీయ నేతలు, దాన్ని అరికట్టడంలో విఫలమై అధికారులు విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఏపీలో పోలింగ్ అనంతరం

6లో ▶

## ఈసారి చరిత్ర సృష్టించబోతున్నాం

### - జగన్ సంచలనం

- ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లిన జగన్
- ఐప్యాక్ ప్రతినిధులతో అరగంట సేపు భేటీ
- 22 ఎంపీ సీట్లు గెలవబోతున్నామన్న జగన్
- ఎన్నికల తర్వాత యావత్ దేశం మనవైపు చూస్తుందని వ్యాఖ్య

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో కొత్త చరిత్ర క్రియేట్ కాబోతోందని జగన్ ధీమా వ్యక్తం చేసారు. ఎన్నికల తరువాత తొలి సారి ఫలితాల పై స్పందించారు. ఐప్యాక్ టీంతో భేటీ అయ్యారు. 2019 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని చెప్పారు. 22 ఎంపీ సీట్లు గెలవబోతున్నట్లు వెల్లడించారు. ప్రశాంత్ కిషోర్ అంచనా వేయని విధంగా సీట్లు రాబోతున్నాయని జగన్ చెప్పుకొచ్చారు. ఈ ఫలితాలను చూసి దేశం మొత్తం షాక్ అవ్వబోతోందని ధీమాగా చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఐ ప్యాక్ బృందంతో భేటీ సందర్భంగా సిఎం జగన్ కీలక వ్యాఖ్యలు చేసారు.

6లో ▶



## అలాంటప్పుడు కోర్టు అనుమతి తప్పనిసరి

### - సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు

- పీఎంఎల్ చట్టంలో సెక్షన్ 19 అధికారాలపై స్పష్టత
- సమన్లకు హాజరైతే అరెస్ట్ చేయలేరని వ్యాఖ్య
- అరెస్ట్ వారెంట్ జారీ విషయంలో కీలక ఆదేశాలు

6లో ▶



## ప్రభుత్వ ఆదాయ పెంపు మార్గాలపై రివ్యూ

### - అధికారులకు కీలక ఆదేశాలు

- పన్ను ఎగవేత పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచన
- నెలవారీ లక్ష్యాలు పెట్టుకొని రాబడులు సాధించాలన్న సీఎం
- జీఎస్టీ ఎగవేస్తే ఎవరినైనా ఉపేక్షించవద్దన్న ముఖ్యమంత్రి
- మద్యం అమ్మకాలు పెరిగినప్పటికీ లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగడం లేదని వ్యాఖ్య



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్ర ఆదాయం పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, పన్నుల ఎగవేత లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరిగేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అవసరమైన సంస్కరణలు చేపట్టాలని ఆదేశించారు. శాఖాపరమైన లొసుగులు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో


6లో ▶

## రాబోయే రోజుల్లో మారిన చంద్రబాబును చూస్తారు

### - టీడీపీ అధినేత ఆసక్తికర వ్యాఖ్యలు

- ఎన్ఆర్ఐలతో టీడీపీ అధినేత చంద్రబాబు భేటీ
- వీడియో కాల్ ద్వారా వారందరితో ఇంటరాక్షన్
- ప్రవాసాంధ్రులపై ప్రశంసలు ల కురిపించిన బాబు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** తెలుగు దేశం పార్టీపై అభిమానంతో సొంత రాష్ట్రానికి వచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న, ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్ఆర్ఐలకు పార్టీ అధినేత చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఎన్ఆర్ఐల కృషి ఎనలేనిదని ముఖ్యమంత్రిగా తాను బాధ్యతలు స్వీకరించిన అనంతరం విదేశాల నుంచి వచ్చిన ఎన్ఆర్ఐలు తనను కలిసేందుకు ప్రత్యేకంగా ఓ విధానాన్ని తీసుకొస్తానని చెప్పారు. టీడీపీ కోసం



ఎన్నికల ప్రచారం చేసి, ఓటు వేసి వెళుతున్న ఎన్ఆర్ఐలతో చంద్రబాబు సమావేశం నిర్వహించారు. వారిని ఉద్దేశంచి చంద్రబాబు వీడియో కాల్‌లో మాట్లాడారు. ఎన్ఆర్ఐల కోసం ప్రత్యేకంగా డిన్నర్ కూడా ఏర్పాటు చేశారు. ఎన్ఆర్ఐలు ఏడాదికి ఓ ఐదుగురు యువకులకు ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు.

6లో ▶

## జీవన్ రెడ్డి మాల్ సీజ్



### - మాల్ స్వాధీనం చేసుకున్న ఆర్టీసీ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ నేత, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి టీఎస్ఆర్టీసీ సంస్థ షాకిచ్చింది. గత కొంత కాలంగా జీవన్ రెడ్డి షాపింగ్ మాల్ అండ్ మల్టిప్లెక్స్ భవనానికి సంబంధించి వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైకోర్టు ఉత్తర్వులు మేరకు భవనాన్ని టీఎస్ఆర్టీసీ సంస్థ స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్వీట్ చేశారు. “హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం బకాయిలను చెల్లించనందున విష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్తో చేసుకున్న అద్దె ఒప్పందాన్ని టీఎస్ఆర్టీసీ యాజమాన్యం

6లో ▶

## భాగ్యనగరంలో భారీ వర్షం

- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు
- వర్షం కారణంగా నగరంలో పలుచోట్ల ట్రాఫిక్ జామ్
- నగరవాసులకు జీహెచ్ఎంసీ కీలక ఆదేశాలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వాతావరణ శాఖ సూచించినట్టుగానే హైదరాబాద్‌తో సహా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో కుండపోత వర్షం కుమ్మరించింది. మధ్యాహ్నం రెండింటి వరకు ఎండ కొట్టగా ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. క్యుములో నింబస్

6లో ▶



# ఆ 8 నియోజకవర్గాలపై అందరి దృష్టి

**లక్నో,** ఆ రాష్ట్రం దేశానికి అనేక మంది ప్రధాన మంత్రులను అందజేసింది. అసలు కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే ముందు ఆ రాష్ట్రంలో గెలవాలి అంటారు. అదే ఉత్తర్ ప్రదేశ్. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, అతిపెద్ద రాష్ట్రంలో పెద్ద ప్రాంతీయ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సహా పలువురు కీలక నేతలు ఈ రాష్ట్రం నుంచే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. అందుకే వారు పోటీ చేసే నియోజకవర్గాలు దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు, ఆసక్తికి కారణమయ్యాయి. మొత్తం 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తర్ ప్రదేశ్‌లో ముఖ్యనేతలు పోటీ చేస్తున్న ఆ 8 నియోజకవర్గాలపై ఓ ఫోకస్.

### వారణాసి..

భారత ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేస్తున్న నియోజకవర్గం వారణాసి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హిందూ మతంలో అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రాల్లో ఒకటిగానే కాదు, భూమ్మీద వేల ఏళ్లుగా మనుగడలో ఉన్న చారిత్రక నగరంగానూ వారణాసి ప్రసిద్ధిగాంచింది. 2014లో మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లోని వడోదర లోక్‌సభ నియోజకవర్గంతో పాటు వ్యూహాత్మకంగా వారణాసిలోనూ పోటీ చేశారు. ఈ చర్య ఉత్తర్‌ప్రదేశ్‌లో అత్యధిక సీట్లు గెలుపొంది కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు దోహదపడింది. 2019లో మరోసారి పోటీ చేసి గెలుపొందగా, ఇప్పుడు మూడోసారి మోదీ మళ్లీ పోటీ చేస్తున్నారు. జూన్ 1న చివరి విడతలో భాగంగా పోలింగ్ జరుపుకోనున్న ఈ నియోజకవర్గంలో మోదీని మరింత భారీ మెజారిటీతో గెలిపించడం కోసం పార్టీ శ్రేణులు శ్రమిస్తున్నాయి. మోదీని ఓడించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా జట్టుకట్టిన విపక్షాలు.. ఈ నియోజకవర్గంలోనూ ఐక్య పోరాటం చేస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్‌ను గెలిపించడం కోసం ఆ పార్టీతో పాటు రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ సమాజ్‌వాదీ కూడా శ్రమిస్తోంది. అజయ్ రాయ్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగానూ ఉన్న విషయం గమనార్హం. "అబ్‌కీ బార్ దస్ లాఖ్ పార్" అంటూ మొత్తం 10 లక్షల ఓట్లు దాటి మోదీకి పోలయ్యేలా రాజకీయ నినాదంతో బీజేపీ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తద్వారా 7 లక్షలకు పైగా మెజారిటీ సాధించవచ్చన్నది వారి ఆలోచనగా కనిపిస్తోంది. 1991 నుంచి ఈ స్థానంలో బీజేపీయే గెలుపొందుతూ వస్తున్నప్పటికీ 2004లో మాత్రం ఓటమిపాలైంది. మోదీ హయంలో కాశీలో జరిగిన అభివృద్ధి, కాశీ విశ్వనాథ్ కారిడార్ ఏర్పాటు, నగరంలో మౌలిక వసతులు, విమానాశ్రయం, రైల్వే స్టేషన్ల అభివృద్ధి, ఆధునీకరణతో పాటు నగరంలో ఎక్కడికక్కడ వంతెనల నిర్మాణం గురించి కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న క్యాన్సర్ ఆస్పత్రి, క్రికెట్ స్టేడియం, నగరంలో అమలు చేస్తున్న పరిశుభ్రత వంటివి కూడా కలిసొచ్చే అంశాలు. కొన్ని దశాబ్దాలుగా ఈ నగరాన్ని సందర్శిస్తున్న దేశ, విదేశీ యాత్రికులు నగరంలో చోటుచేసుకుంటున్న మార్పులు, జరుగుతున్న అభివృద్ధి, పెరిగిన మౌలిక వసతులను ప్రత్యక్షంగా గమనిస్తున్నారు.

### అమేథీ..

కాంగ్రెస్ యువరాజుగా పేరొందిన రాహుల్ గాంధీ గత 2 దశాబ్దాలుగా పోటీ చేస్తూ వచ్చిన నియోజకవర్గమే అమేథీ. రాయ్‌బరేలికి ఆనుకుని ఉన్న ఈ నియోజకవర్గంలో ఆయన 2004 నుంచి పోటీ చేస్తూ వరుసగా 3 పర్యాయాలు గెలుపొందారు. అయితే 2019లో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చేతిలో ఆయన ఓడిపోయి పరాభవాన్ని ఎదుర్కొన్నారు. అయితే ఆయన కేరళలోని వాయనాడ్ స్థానం నుంచి కూడా పోటీ చేయడం, అక్కణ్నుంచి గెలుపొందడంతో కొంత ఊరట లభించింది. ఈసారి అమేథీలో రాహుల్ గాంధీ మరోసారి పోటీ చేస్తారా లేదా అన్న ఉత్కంఠ నిన్నమొన్నటి వరకు నెలకొంది. చివరకు అమేథీ నుంచి తప్పుకుని, కిశోరీలాల్ శర్మకు చోటిచ్చారు. నాలుగు దశాబ్దాల తర్వాత గాంధీ-నెహ్రూ కుటుంబానికి చెందని వ్యక్తి కాంగ్రెస్ తరఫున తొలిసారిగా పోటీ చేస్తున్నారు. రాహుల్ గాంధీ తనను 2019లో గెలిపించిన వాయనాడ్‌తో పాటు తన తల్లి సోనియా గాంధీ వదిలిపెట్టిన రాయ్‌బరేలి నుంచి కూడా బరిలోకి దిగారు. ప్రధాన మంత్రులను అందిస్తూ, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఉత్తర్ ప్రదేశ్ వంటి రాష్ట్రంలో రాహుల్ గాంధీ పోటీకి విముఖత వ్యక్తం చేసినప్పటికీ.. పార్టీలో ఇతర సీనియర్ నేతల ఒత్తిడి, మిత్రపక్షాల ఒత్తిడితో సేఫ్ సీటుగా పరిగణిస్తున్న రాయ్‌బరేలిని ఆయన ఎంచుకున్నారు. నిజానికి రాహుల్ గాంధీతో పాటు ఆయన సోదరి ప్రియాంక వాద్రా కూడా పోటీ చేయాలని పార్టీ శ్రేణులు డిమాండ్ చేశాయి. తల్లి వదిలిపెట్టిన రాయ్‌బరేలి నుంచి ప్రియాంక, తన పాత స్థానం అమేఠీ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తారని ఊహాగానాలు కూడా చెలరేగాయి. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన కిశోరీలాల్ శర్మ (కేఎల్ శర్మ)ను అమేథీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. జన్మతః పంజాబీ అయిన కేఎల్ శర్మ.. రాహుల్ గాంధీ జాతీయ రాజకీయాల్లో బిజీగా ఉన్న సమయంలో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న అమేఠీ నియోజకవర్గంలో రాహుల్ గాంధీకి ప్రతినిధిగా పనిచేశారు. అలా నియోజకవర్గ ప్రజలతో 2 దశాబ్దాల అనుబంధం ఆయనకు ఉంది. అది కలిసొచ్చి స్మృతి ఇరానీని ఓడిస్తుందా లేక రాహుల్ గాంధీకి జరిగిన పరాభవమే ఆయన కూడా ఎదుర్కోవాల్సి వస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

### రాయ్ బరేలి..

దేశంలోని హై-ప్రొఫైల్ నియోజకవర్గాల్లో రాయ్ బరేలి ఒకటి. యూపీఏ చైర్‌పర్సన్‌గా ప్రధాని కార్యాలయాన్ని సైతం తన గుప్పిట్లో పెట్టుకుని చక్రం తిప్పిన సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమే రాయ్ బరేలి. వయోభారం దృష్ట్యా ప్రత్యక్ష ఎన్నికలకు దూరమై, ఆమె రాజస్థాన్ నుంచి పెద్దల సభ రాజ్యసభకు ఎన్నికయ్యారు. అందుకే ఈసారి రాయ్‌బరేలి నుంచి ఎవరు పోటీ చేస్తారా అన్న ఉత్కంఠ నెలకొనగా.. గాంధీ-నెహ్రూ కుటుంబ కంచుకోటగా పేరొందిన ఈ స్థానం నుంచి రాహుల్ గాంధీనే అభ్యర్థిగా ప్రకటిస్తూ ఏఐసీసీ ఉత్కంఠకు తెరదించింది. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీన ఆయన తన నామినేషన్ పత్రాలను అందజేశారు. 2019లో సోనియా గాంధీపై పోటీ చేసి, గట్టి పోటీనిచ్చిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థి దినేశ్ ప్రతాప్‌కే ఈసారి కూడా టికెట్ లభించింది. అమేఠీలో 2019లో రాహుల్ గాంధీని స్మృతి ఇరానీ ఓడించినట్టుగా ఈసారి తాను రాయ్‌బరేలీలో ఓడించి సరికొత్త రికార్డు సృష్టించాలని దినేశ్ ప్రయత్నిస్తున్నారు. అమేఠీలో సాధ్యపడిన విజయం ఇక్కడెందుకు సాధ్యపడదు అన్న ఆత్మవిశ్వాసంతో ఆయన వడివడిగా ముందుకు సాగుతున్నారు. అయితే తన సోదరుడి విజయం కోసం ప్రియాంక వాద్రా ఈ నియోజకవర్గంపై స్పెషల్ ఫోకస్ పెట్టి ప్రచారం చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

### లఖ్‌నవూ..

ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్ర రాజధాని లఖ్‌నవూ సైతం దేశంలోని హై-ప్రొఫైల్ నియోజకవర్గాల్లో ఒకటి. ప్రస్తుతం కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గం సుదీర్ఘకాలంగా బీజేపీకి కంచుకోటగా మారింది. 1991 నుంచి వరుసగా బీజేపీయే ఇక్కడ గెలుపొందుతూ వస్తోంది. 1991, 1996, 1998, 1999, 2004 ఎన్నికల్లో బీజేపీ అగ్రనేత అటల్ బిహారీ వాజ్‌పేయి వరుసగా గెలుపొందుతూ వచ్చారు. అలా దేశానికి ప్రధానిని అందించిన నియోజకవర్గాల్లో ఒకటిగా నిలిచిన ఈ స్థానంలో 2014, 2019 ఎన్నికల్లో వరుసగా గెలుపొందిన రాజ్‌నాథ్ సింగ్, మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించాలని చూస్తున్నారు. ప్రస్తుతానికి దేశవ్యాప్త ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్ బిజీగా ఉన్న నేపథ్యంలో ఆయన బృందం స్థానికంగా విస్తృతంగా ప్రచారం చేస్తోంది. రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలో ఉండడం, లఖ్‌నవూ నగరాభివృద్ధిలో రాజ్‌నాథ్ సింగ్ కీలక పాత్ర పోషించడం బీజేపీకి కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. ఆయనపై సమాజ్‌వాదీ పార్టీ నుంచి రవిదాస్ మెహ్రోత్రా పోటీ చేస్తున్నారు. 2014 కంటే 2019లో మెజారిటీని మరింత పెంచుకున్న రాజ్‌నాథ్ సింగ్ ఈ ఎన్నికల్లో ఎంత మెజారిటీ సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

### కన్నౌజ్..

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పోటీ చేస్తున్న కన్నౌజ్ నియోజకవర్గం కూడా దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. మే 13న జరగనున్న నాలుగవ విడత పోలింగ్‌లో ఈ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగాయి. తొలుత ఈ నియోజకవర్గం నుంచి ములాయం పరివారానికి చెందిన తేజ్ ప్రతాప్ యాదవ్ పేరును అభ్యర్థిగా ప్రకటించారు. అయితే నామినేషన్ల దాఖలుకు తేదీ సమీపించిన తర్వాత అకస్మాత్తుగా అఖిలేశ్ తెరపైకి వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ ఇక్కడ సుబ్రతా పాఠక్‌ను అభ్యర్థిగా బరిలోకి దించింది. సుబ్రతా పాఠక్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో అఖిలేశ్ సతీమణి డింపుల్ యాదవ్‌ను 12,353 ఓట్ల స్వల్ప తేడాతో ఓడించగలిగారు. ఇప్పుడు అఖిలేశ్ స్వయంగా రంగంలోకి దిగడంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

### మైన్‌పురి..

ఉత్తర్‌ప్రదేశ్‌లోని మైన్‌పురి లోక్‌సభ స్థానం యావద్దేశం దృష్టిని ఆకర్షించడానికి కారణం ఒక్కటే.. అది సమాజ్‌వాదీ వ్యవస్థాపకులు ములాయం సింగ్ యాదవ్ రెండున్నర దశాబ్దాలకు పైగా ప్రాతినిధ్యం వహించడంతో పాటు ఇప్పుడు ఆయన కోడలు డింపుల్ యాదవ్ పోటీ చేస్తుండడమే. మే 7న జరగనున్న 3వ విడత పోలింగ్‌లో ఈ నియోజకవర్గం ఉంది. గత 26 ఏళ్లుగా యాదవ్ పరివార్ (ములాయం సింగ్ యాదవ్ కుటుంబం) ఇక్కడ అధికారంలో ఉంది. 2022లో ములాయం మరణించిన తర్వాత ఆ స్థానానికి జరిగిన ఉప-ఎన్నికల్లో ములాయం కోడలు (అఖిలేశ్ యాదవ్ సతీమణి) డింపుల్ యాదవ్ పోటీ చేసి గెలుపొందారు. ఇప్పుడు జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆమె మరోసారి పోటీ చేస్తున్నారు. ఆమెకు ప్రత్యర్థిగా భారతీయ జనతా పార్టీ (ఃఏఖ) నుంచి జైవీర్ సింగ్ బరిలో నిలిచారు. ఆయన ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మంత్రివర్గంలో పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నారు. మైన్‌పురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచే ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈసారి గెలుపు ఎవరిని వరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

### సుల్తాన్‌పూర్..

గాంధీ-నెహ్రూ కుటుంబంలో మనేకా గాంధీ పోటీ చేస్తుండడంతో సుల్తాన్‌పూర్ నియోజకవర్గం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. సోనియా గాంధీకి తోడికోడలైన మనేకా గాంధీ మోదీ సర్కారులో కేంద్ర మంత్రిగానూ పనిచేసిన విషయం తెలిసిందే. 2014లో పీలీభీత్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందిన మనేకా గాంధీ, 2019లో సుల్తాన్‌పూర్‌కు మారారు. అప్పటి వరకు ఈ నియోజకవర్గ ఎంపీగా ఉన్న మనేకా కుమారుడు వరుణ్ గాంధీ, పీలీభీత్ నుంచి 2019లో ఎన్నికయ్యారు. అంటే తల్లీకొడుకులు తమ నియోజకవర్గాలను మార్చుకున్నారు. కానీ వరుణ్ గాంధీ వ్యవహారశైలి, సొంతపార్టీ అగ్రనాయకత్వంపై చేసిన విమర్శల కారణంగా బీజేపీ అధిష్టానం ఈసారి ఆయనకు టికెట్ నిరాకరించింది. ఈ పరిస్థితుల్లో సుల్తాన్‌పూర్‌లో మరోసారి పోటీ చేస్తున్న మనేకా గాంధీపై సమాజ్‌వాదీ పార్టీ నుంచి రాంభువల్ నిషాద్, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి ఉదయ్ రాజ్ వర్మ పోటీ చేస్తున్నారు.

### గోరఖ్‌పూర్..

ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గం కూడా దేశవ్యాప్తంగా ఉన్న హై-ప్రొఫైల్ నియోజకవర్గాల్లో ఒకటి. జూన్ 1న జరగనున్న చివరి విడత పోలింగ్‌లో ఇక్కడ ఎన్నికలు జరగనున్నాయి. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయ్యే వరకు ఆయన ఈ స్థానం నుంచి వరుసగా 5 పర్యాయాలు ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఈ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నది భోజ్‌పురి సూపర్‌స్టార్ రవి కిషన్. తెలుగువారికి "రేసు గుర్రం" సినిమాలో విలన్ క్యారెక్టర్ మద్దాలి శివారెడ్డిగా సుపరిచితుడు. ఆయనపై పోటీగా సమాజ్‌వాదీ పార్టీ కాజల్ నిషాద్‌ను బరిలోకి దించింది.

# డీబీటీ పథకాల నిధుల విడుదల

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ముందు రాజకీయ దుమారానికి కారణమైన డీబీటీ పథకాల నిధుల విడుదల ప్రారంభమైంది. దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను ప్రభుత్వం ఇచ్చింది. బుధవారం నుంచి నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు పేర్కొంది. బుధవారం ఒక్కరోజే లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేశామని ప్రభుత్వం వెల్లడించింది. ఆసరా పథకం కింద 1480 కోట్ల రూపాయలు విద్యాదీవెన కింద 502 కోట్లు విడుదల చేశారు. అన్ని పథకాలకు త్వరలోనే పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. రెండు మూడు రోజుల్లో అన్ని పథకాలకు నిధుల విడుదల పూర్తి చేస్తామని అధికారులు వివరించారు. జనవరి నుంచి వివిధ పథకాలకు ఇవ్వాల్సిన నిధులను ప్రభుత్వం పోలింగ్‌కు రెండు రోజుల ముందు విడుదల చేయాలని ప్రయత్నించింది. దీనిపై ఎన్నికల సంఘం అభ్యంతరం చెప్పింది. ఇలా నిధులు విడుదల చేస్తే కచ్చితంగా ఎన్నికలపై ప్రభావం చూపిస్తుం అవుతుందని అభిప్రాయపడింది పేర్కొంది. ఈ విషయం కోర్టు వరకు వెళ్లింది. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలపై వైసీపీ సానుభూతిపరులు, పథకాల లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఒక్కరోజు సమయం ఇచ్చి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు వేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్కడా ప్రచార ఆర్భాటాలు లేకుండా సైలెంట్‌గా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపింది. నాయకులు కూడా దీనిపై ఎలాంటి ప్రకటనలు చేయొద్దని ఆదేశించింది. దీనిపై కూడా ఎన్నికల సంఘం అనేక అనుమానాలు వ్యక్తం చేసింది. ఇన్ని రోజుల నుంచి ఇవ్వకుండా ఇప్పుడే ఇవ్వడానికి కారణాలు చెప్పాలని, అసలు అంత డబ్బులు ఇప్పుడు ఎక్కడ సర్దుబాటు చేస్తున్నారని ప్రశ్నించింది. ఎన్నికల సంఘం అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో పోలింగ్‌కు ముందు రోజు పడాల్సిన నిధులు జమ కాకుండా పోయాయి. అయితే పోలింగ్ వారం సందర్భంగా పోలింగ్ తర్వాత రోజు నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. దీంతో పోలింగ్ ముగియడంతో నిధుల పంపిణీ మొదలైంది.

# గోడ కూలి వ్యక్తి మృతి.. ముగ్గురికి గాయాలు

**సంగారెడ్డి** సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మి నగర్ కాలనీలో అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి గోడ కూలి పక్కింట్లో నిద్రిస్తున్న వారిపై పడడంతో ఒడిస్సా కు చెందిన ప్రఫుల్ల మహాకూర్(52) మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల్లో మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఓర్వలేక వైకాపా దాడులు

**విశాఖపట్నం** ఓర్వలేని తనంతోనే వైసిపి దాడులకు దిగు తుందని తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా అధ్య క్షులు గండి బాబ్జీ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యా లయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బాబ్జీ మాట్లా డుతూ తిరుపతిలో టిడిపి అభ్యర్థి పులి వర్తి నాని పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని అన్నా రు.చెవిరెడ్డి కొడుకు చేసిన దౌర్జన్యం ప్రజా స్వామ్యానికి మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు.ఓర్వలేనితనంతో దాడు లకు దిగడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు.జగన్ మరోసారి సిఎమ్ అయితే రాష్ట్రానికి జరిగే ముప్పేనని అన్నారు.జగన్ తనకు వచ్చిన అవకాశాన్ని దుర్వి ని యోగం చేసుకున్నారని అన్నారు.అధికారంలోకి వచ్చి న తర్వా త ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చుకుం టామని చెప్పారు.

# యూకే ఎన్నికల్లో కరీంనగర్ బిడ్డ

**కరీంనగర్ :** బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి తెలుగు వ్యక్తి సిద్ధమయ్యారు.. ఈయన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగరంకు చెందిన ఉదయ్ నాగరాజు. యూకేలోని లేబర్ పార్టీ నుంచి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. నార్త్ బెడ్ ఫోర్డ్ షైర్ లేబర్ పార్టీ పార్లమెంటరీ అభ్యర్థిగా పార్టీ ప్రకటించింది. "నార్త్ బెడ్ ఫోర్డ్ షైర్ అనేది అక్కడి బౌండరీ కమిషన్ సూచనతో కొత్తగా ఏర్పడ్డ పార్లమెంట్ నియోజకవర్గం.అయితే, యూకేలోని ప్రఖ్యాత సర్వే సంస్థ ఎలెక్టోరల్ కాల్కులస్ ప్రకారం నియోజకవర్గంలో 68 శాతం లేబర్ పార్టీ గెలువబోతుందని అంచనా వేసింది. ప్రస్తుతం బ్రిటన్ లోనూ ఎన్నికల హడావిడి మొదలయింది. భారతదేశంలో ఇప్పటికే ఎన్నికలు జరుగుతుండగా ఈ సంవత్సరంలోనే బ్రిటన్, అమెరికాల్లోనూ ఎన్నికలు జరగనున్నాయి. రష్యా - ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్ - పాలస్తీనా సంఘర్షణ, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో జరుగుతున్న బ్రిటన్, అమెరికా ఎన్నికల మీద ప్రపంచ దేశాల దృష్టి ఉంది.

### మంచి పట్టు సాధించిన ఉదయ్

కాగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామంలో ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబంలో ఉదయ్ నాగరాజు జన్మించారు. శనిగరం గ్రామానికి చెందిన నాగరాజు హనుమంతరావు, నిర్మలాదేవి దంపతుల కుమారుడు. చిన్నప్పటి నుంచే కష్టపడేతత్వం కలిగి ఉండే ఉదయ్ అంచెలంచాలుగా ఎదిగారు. బ్రిటన్ లోని ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ కాలేజీ అఫ్ లండన్ లో పాలనా శాస్త్రంలో పీజీ చేశారు. ప్రపంచ సమాజం, భావితరాలపై ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రభావం ముందుగానే పసిగట్టి ఏఐ పాలసీలాబ్స్ అనే థింక్-ట్యాంక్ ని నెలకొల్పారు. అంతర్జాతీయ వక్తగా, రచయితగా మంచి పేరు సంపాదించారు ఉదయ నాగరాజు. క్షేత్రస్థాయి సమస్యలపైన ఉదయ్ కు మంచి పట్టు ఉంది. స్కూల్ గవర్నర్ గా, వాలంటీర్ గా, విస్తృత రాజకీయ ప్రచారకుడిగా ఒక దశాబ్దకాలంగా ఇంటింటికీ ప్రచారంతో సామాన్యుల కష్టాలపై మంచి అవగాహన సాధించారు.దాదాపు అన్ని సర్వే సంస్థల ప్రకారం ఈ ఎన్నికల్లో లేబర్ పార్టీ అఖండ విజయం సాధించి ప్రభుత్వాన్ని నెలకొల్పనుంది. ప్రఖ్యాత తెలుగు రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా ఈ సర్వేల ఆధారంగా కన్సర్వేటివ్ పార్టీ కనీవిని ఎరుగని రీతిలో ఓడిపోయి లేబర్ పార్టీ గెలుస్తుందని విశ్లేషించారు. గత కొన్ని ఎన్నికల్లోనూ లేబర్ పార్టీ ఎంపీలు వరుసగా గెలుస్తూ వస్తున్నారు. ఈ నెల జరిగిన కౌన్సిలర్, రాష్ట్ర మేయర్ ఎన్నికలోనూ లేబర్ పార్టీ ఘన విజయం సాధించింది. దీనితో తెలుగు బిడ్డ ఉదయ్ నాగరాజు కూడా బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా ఘన విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తుంది

# జంగా సభ్యత్వం రద్దు

**విజయవాడ :** ఏపీ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు.. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పై అనర్హత వేటు వేశారు. గతంలో వైసీపీ( తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికైన కృష్ణమూర్తి.. ఇటీవలే ఎన్నికలకు ముందు టీడీపీ లో చేరారు. దీంతో ఈ విషయంపై వైసీపీ విఫ్ లేళ్ల అప్పిరెడ్డి శాసనమండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు.. ఫిరాయింపుల చట్టం కింద జంగా కృష్ణమూర్తిపై అనర్హత వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు అర్ధరాత్రి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

# తిరుపతిలో గంగమ్మ జాతర... సందడి

**తిరుపతి :**మొన్నటి వరకూ ఎన్నికల ప్రచారాలతో మోతెక్కిన తిరుపతి నగర విధులు.. ఇవాళ్టి నుంచి ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో జరిగే ప్రముఖ జాతరల్లో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు ఎంతో విశిష్టత ఉంది. ప్రతీ ఏటా మే నెలలో ఏడు రోజుల పాటు జాతర నిర్వహించటం జరుగుతుంది. నిన్న అర్ధరాత్రి చాటింపుతో తిరుపతి గ్రామ దేవతగా పిలుచుకొనే చిన్నగంగమ్మ జాతర గ్రాండ్‌గా ప్రారంభమైంది. 21వ తేదీ వరకు ఏడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. 22వ తేదీన తెల్లవారు జామున అమ్మవారి విశ్వరూప దర్శనం, చెంప నరికే కార్యక్రమంతో జాతర ముగియనుంది. ఏడు రోజుల పాటు వివిధ వేషాలలో గంగమ్మను భక్తులు దర్శించుకోనున్నారు.సంప్రదాయం ప్రకారం కైకాల వంశస్తులు తిరుపతి గంగజాతర సందర్భంగా అర్ధరాత్రి గ్రామంలో చాటింపు పూజ నిర్వహించి నగర శివారు ప్రాంతాలలో అష్టదిగ్భంధనం చేసి చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు. జాతర ప్రారంభం కావడంతో అమ్మవారి అనుగ్రహం పొందేందుకు పూజలు నిర్వహిస్తారు. ఇవాళ బైరాగివేషంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. రేపు బండ వేషం, 17న తోటి వేషం, 18న దొర వేషం, 19న మాతంగి వేషం, 20న సున్నపు కుండలు, 21న గంగమ్మకు చప్పరం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక 22న విశ్వరూప దర్శనం తర్వాత చెంప నరికే కార్యక్రమంతో జాతర ముగుస్తుంది.అలాగే తిరుపతి గ్రామ దేవత గంగమ్మ జాతరలో మరో విశేషం ఉంది. జాతర జరిగినన్ని రోజులు గ్రామస్తులు ఊరి విడిచి వెళ్లరు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా రాత్రుళ్లు బస చేయకుండా వెళ్లిపోవడం ఇక్కడి ఆచారం. తాతయ్యగుంట గంగమ్మ జాతరకు 900 ఏళ్ల చరిత్ర ఉంది. గ్రామదేవతగా అవతరించిన గంగమ్మ.. సాక్షాత్తు తిరుమల శ్రీవారి చెల్లెలుగా కొలుస్తారు.గంగమ్మ జాతర ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌తోపాటు డీఆర్వోను సమన్వయం చేసుకుని ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

# మరో సమరానికి పార్టీలు సిద్ధం

**హైదరాబాద్ :** తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు ముగిసినా మరో ఎన్నికకు ప్రధాన పార్టీలన్నీ సిద్ధమవుతున్నాయి. అదే ఈ నెల చివరన జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఉప ఎన్నికకు పార్టీలు రెడీ అవుతున్నాయి. మూడు జిల్లాల నేతలతో మూడు పార్టీలు ముమ్మర కసరత్తు ప్రారంభించి.. పట్టభద్రుల స్థానంపై పట్టుకోసం ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల సమరం సమాప్తమైన ఎన్నికల మోడ్ మాత్రం పోలేదు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక హడావుడి మొదలైంది. పల్లా రాజేశ్వరరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి ఎమ్మెల్సీ రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక వచ్చింది. కాంగ్రెస్ పార్టీ నుంచి చింతపండు నవీన్ మల్లన్న, బిఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్ రెడ్డి, బిజెపి తరపున ప్రేమేందర్ రెడ్డి బరిలో ఉన్నారు. సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని బిఆర్ఎస్ ప్రయత్నాలు గట్టిగా చేస్తోంది. ఈ నెల 27 న ఎమ్మెల్సీ బై పోల్ జరగనుండటంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రధాన పార్టీలు పని ప్రారంభించాయి.బిఆర్ఎస్?కు సిట్టింగ్ సీట్ కావడంతో ఎలాగైన తిరిగి దక్కించుకోవాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగంలోకి దిగారు. ఖమ్మం వరంగల్ నల్గొండ్ జిల్లా నేతలతో సమావేశమై వ్యూహ రచన చేశారు. ప్రచార, సమన్వయ బాధ్యతలు కీలక నేతలకు అప్పగించి పట్టభద్రులను ప్రసన్నం చేసుకునేందుకు ప్లాన్ వేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం పడకుండా.. లోక్ సభ ఎన్నికల ప్రచార జోష్ తో ఎమ్మెల్సీ ప్రచార వ్యూహాలను కేటీఆర్ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 12 రోజుల్లో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పట్టభద్రులతో సమావేశాల నిర్వహకు స్కెచ్ వేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అదే ఊపుతో ఈ ఎమ్మెల్సీ స్థానం కైవసం చేసుకుంటామనే ధీమాతో ఉంది. ఉప ఎన్నికపై సీఎం రేవంత్ రెడ్డి ఆయా జిల్లా నేతలతో రివ్యూ చేశారు. ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారంలో పాల్గొని గెలిపించే బాధ్యతను వారికి అప్పగించారు.

అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 34 ఎమ్మెల్యే స్థానాలు ఉండగా అందులో 33 స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో కీలకంగా పనిచేసి ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని నేతలకు సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ప్రచార వ్యూహాలను పక్కాగా అమలు చేసి విజయబావుటా ఎగురవేయాలని కాంగ్రెస్ స్కెచ్ వేసింది.మరోవైపు బిజెపి సైతం ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. లోక్ సభ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పూర్తిగా ఉప ఎన్నికపైనే ఫోకస్ చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఆర్గనేజేషనల్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ మూడు జిల్లాల నేతలు, రాష్ట్ర స్థాయినేతలతో ఎమ్మెల్సీ ఎన్నికపై చర్చించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ జరుగుతున్న మూడు జిల్లాల అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా రాష్ట్రనేతలను ఇన్ చార్జులుగా నియమించారు. లోక్ సభ ఎన్నికల్లో బిజెపికి ఎంతో పాజిటివ్ ట్రెండ్ వచ్చిందని.. గొప్ప ఫలితాలు రాబోతున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. అదే పాజిటివిటీతో ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. మొత్తంగా మూడు పార్టీలు లోక్ సభ ఎన్నికల తర్వాత మూడు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక టార్గెట్ గా కార్యచరణలో బిజీ అయిపోయాయి. మరి పట్టభద్రులు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి.

# పెంపుడు కుక్క వివాదం..

## - కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలు



**హైదరాబాద్** పెంపుడు కుక్క విషయంలో తలెత్తిన వివాదంతో రెండు కుటుంబాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈ దాడిలో ఓ కుటుంబానికి చెందిన వారు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. కుక్కకు కూడా బలంగా దెబ్బలు తగిలాయి. ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రహ్మత్‌నగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్ నివాసి మధు కుటుంబం హస్కీ జాతికి చెందిన కుక్కను పెంచుకుంటున్నారు. ఈనెల 8న పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు మధు కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయలుదేరారు. ఆ సమయంలో పెంపుడు కుక్క కూడా వీరితో పాటు బయటకు వచ్చి.. నిర్మాణంలో ఉన్న ఎదురింటి ధనుంజయ్ ఇంటి ఆవరణలోకి వెళ్లింది. కుక్కను తమపై ఉసిగొల్పారంటూ ధనుంజయ్ కుటుంబ సభ్యులుగొడవకు దిగారు. ఈ గొడవపై రెండు కుటుంబాలు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ ఘటనతో కోపం పెంచుకున్న ధనుంజయ్ ప్రతికారంతో రగిలిపోయాడు. దాడి చేసేందుకు అవకాశం కోసం వేచి చూశాడు. ఇదిలా ఉండగా.. మంగళవారం సాయంత్రం మధు సోదరుడైన శ్రీనాథ్ కుక్కను తీసుకుని వాకింగ్కు బయలుదేరాడు. ఇది చూసిన ధనుంజయ్ మరో నలుగురితో కలిసి వచ్చి ఇంటి గేటు వద్ద ఉన్న కుక్కను ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా కొట్టారు. ప్రాణంలా చూసుకునే కుక్కను ధనుంజయ్ కొడుతుంటే.. శ్రీనాథ్, అతడి కుటుంబ సభ్యులు కుక్కను కాపాడే ప్రయత్నంలో అడ్డుకున్నారు. దీంతో మరింత రెచ్చిపోయిన ధనుంజయ్ తో సహా ఐదుగురు వ్యక్తులు మూకుమ్మడిగా మధు కుటుంబీకులపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో మధు సోదరుడు శ్రీనాథ్ తో పాటు అతడి తల్లి రాజేశ్వరి, అతడి మరదలు స్వప్నను కూడా ఇనుప రాడ్లతో కొట్టి తీవ్రంగా గాయపర్చారు. దెబ్బలతో కుక్కతో పాటు కుటుంబ సభ్యుల పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

- అకాల వర్షానికి మొలకెత్తిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి
- అన్నదాతను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవట్లేదు
- ప్రభుత్వానికి డిమాండ్ చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్

**మెదక్ (ప్రతినిధి) (ప్రశ్న న్యూస్)** బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి సూచన మేరకు గురువారం నాడు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ రమేష్ కి రైతుల పక్షణా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మాజీ రైతుబంధు అధ్యక్షులు సోములు మాట్లాడుతూ వ్యవసాయానికి కరెంటు నీళు ఇవ్వకుండా అన్నదాతను ఏడిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పండించిన వడ్లు కొనకుండా గోశ పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం వానకు తడుస్తుంటే పట్టించుకోని సర్కారు తీరు చూసి గుండె మండిన అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు అని అన్నారు. ఎన్నికలు పోలింగ్ ముగిసిన తెల్లారే వడ్లకు రూపాయలు 500 బోనాలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్న వడ్లకు బోనస్ అంటూ ప్రకటించడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన మర్నాడు క్వింటాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు రైతంగని మోసం చేశారని అన్నారు. రాష్ట్రంలో 90 శాతం మంది రైతులు దొడ్డ రకం వాటిలని పండిస్తారని ఈ విషయం తెలిసి కూడా సన్న వడ్లకే బోనస్ ఇస్తామని ఎలా ప్రకటించారని నిలదీశారు. ఓట్లు డబ్బాలో పడంగానే కాంగ్రెస్ పార్టీకి రైతుల అవసరం తీరింది. అందుకే నాలిక మర్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పంచుకుంది. సన్న వడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు చెప్పి ఉంటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కుతుక్కు చేసేవారు. ప్రజలు ఇప్పటికీ ఆగ్రహంతోనే ఉన్నారు. రైతులకు రైతుబంధు, రైతు భరోసా ఇవ్వకుండా రైతన్న అన్ని రకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంది. రైతంగా హక్కులను హామీలను సాధించేందుకు బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతుందని అన్నారు. రైతులు తెలంగాణ ప్రజలు వద్దురా నాయన కాంగ్రెస్ పాలన సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తున్నారని అన్నారు. అకాల వర్షాలకు మొలకెత్తిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, పాపన్నపేట మండలం వైస్ ఎంపీపీ పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, పాపన్నపేట మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు జగన్, నాయకులు బాలరాజు, కిషన్, రమేష్,రైతులు రామయ్య, పవన్, నరసింహారెడ్డి, యాదగిరి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



# నిరాశ నిస్పృహల వల్లే వైసీపీ దాడులు

## - మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు

**విజయవాడ** "ప్రభుత్వ అధికారులు పూర్తిగా ఎన్నికల నిర్వహణలో వైఫల్యం చెందారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం కూడా శాంతిభద్రతలు లోపించాయని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు అన్నారు. . రాష్ట్రంలో అరాచకం పోవాలి. రాష్ట్ర నలుమూలల నుంచే కాదు దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఓటర్లు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం పోవాలి. ఐదు గంటలు 6 గంటలు వేచి ఉండి, అర్ధరాత్రి రెండు గంటల వరకు కూడా నిలబడి ఓటు హక్కు వినియోగించుకోవడానికి నిలబడ్డారుంటే వైసీపీ పట్ల ప్రజలకు ఉన్న వ్యతిరేకతే నిదర్శనం. రాష్ట్రం కోసం, ప్రజాస్వామ్యం కోసం ప్రజలు ఓట్లు వేశారు. ఇది చూసి తట్టుకోలేక వైసీపీ నాయకులు బూతుల దగ్గర గొడవలు సృష్టించారు. రెచ్చగొట్టే కార్యక్రమాలు చేశారు. ఓటర్లను బెదిరింపులకు పాల్పడ్డారు. పలనాడు జిల్లాలో హింసాత్మకమైన సంఘటనలు జరిగాయి. దాడులు చేస్తున్నా, పెట్రోల్ పోసి తగలబెడుతున్నా పోలీసులు పట్టించుకోలేదు. బూతులు వద్ద పోలీసు బందోబస్తు లేదు. పెట్రోలింగ్ లేదు. బూతులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. తాడిపత్రి స్ట్రాంగ్ రూమ్ పక్కనే పులివర్తి నాని పై దాడి జరిగింది. ఇదంతా ఉద్దేశపూర్వకంగానే జగన్ చేయించారు. అరాచకాలు సృష్టించారు. వైసిపి నాయకుల్ని మద్యం పోయించి రెచ్చగొట్టే కార్యక్రమాలు చేశారు. వీటన్నింటిని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. కచ్చితంగా ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చారు ఛీఫ్ ఎన్నికల కమిషన్ నుండి డీజీపీ, ఛీఫ్ సెక్టటరి లకు సమన్లు వచ్చాయి. కచ్చితంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి, జనసేన, బిజెపి పల్నాడు వెళ్లి బాధితులకు ధైర్యం కల్పిస్తాం. అందుకు గవర్నర్ గారిని అనుమతి కోరాం. 144 సెక్షన్ ఉన్నప్పటికి బాధితులకు నైతిక స్థైర్యాన్ని కల్పించాలి అనుకున్నాం. ప్లానింగ్ వేసుకొన్నాం. భవిష్యత్ కార్యారక్షణ తయారు చేసుకుంటాం. ఇలాంటి సంఘటనలు జరగనివ్వం. గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాంమని అన్నారు.

# అన్నింటా కూటమిదే పై చేయి



**తాడేపల్లిగూడెం** కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ నుకలిసిన నియోజకవర్గ కూటమి నాయకులు పట్టణం లేదు పల్లె లేదు వార్డు లేదు అన్ని ప్రాంతాల్లోనూ కూటమి తన హవా చాటుకుందని కూటమి నాయకులు స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలోని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాసును గురువారం నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం పట్టణం, తాడేపల్లిగూడెం మండలం, పెంటపాడు మండలం లోని గ్రామాలకు చెందిన కూటమి నాయకులు విడివిడిగా బొలిశెట్టితో సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో, వార్డుల్లో కూటమి హవాను విశ్లేషించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి తరుపున తిరిగిన నాయకులతోపాటు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు కూడా జగన్మోహన్ రెడ్డిని తరిమికొట్టేందుకు కసిగా పని చేశారని. జగన్ మరోసారి అధికారం చేపడితే రాష్ట్రానికి కలిగే ప్రమాదాన్ని అంతా గుర్తించారన్నారు. రాష్ట్రంలో రామరాజ్యం స్థాపించడం ఖాయమని నరేంద్ర మోడీ ఆశీస్సులు, చంద్రబాబు నాయుడు విజన్, పవన్ కళ్యాణ్ నిబద్ధత అన్నీ కలిపి రాష్ట్రం దేశంలోనే అభివృద్ధిలో ముందుకు దూసుకు వెళ్లడం ఖాయమన్నారు.

# బియ్యం డెలివరీ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) బియ్యం డెలివరీ మరియు రబీ 2022-23 సీజన్ కి సంబంధించి టెండర్ అయిన ధాన్యం అప్పగింతలు త్వరగా చేయాలని రైస్ మిల్ యజమానులకు తేల్చి చెప్పారు.నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామం లో ఉన్న వేంకటేశ్వర రైస్ మిల్ ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లా లో ఉన్న మిల్లర్లు బియ్యం డెలివరీ వేగవంతం చేసి త్వరగ వానాకాలం ధాన్యం బియ్యం అప్పగించాలని మరియు టెండర్ పూర్తి అయిన యాసంగి రభి 2022-23 ధాన్యం వెనువెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని బియ్యం డెలివరీలో జిల్లాలను ముందు వరుసలో నిలపాలని, రోజు వారి బియ్యం పంపిణీపై సమీక్ష చేసి రోజు వారి నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించారు.కలెక్టర్ వెంట , జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు జిల్లా మేనేజర్ హరికృష్ణ ,సివిల్ సప్లై కార్పోరేషన్ సిబ్బంది ఉన్నారు.

# మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



**కొత్తూరు (ప్రశ్న న్యూస్)** మండల కేంద్రంలో ఒక ప్రైవేటు కంపెనీలో కూలీగా పని చేస్తున్న బిన్ను దాస్ తండ్రి లేట్ రాందాస్ వయసు 55 సంవత్సరాలు యొక్క కుమారుడు భిక్షాదాస్ వయసు 22 సంవత్సరాలు మతిస్థిమితం సరిగా లేని వ్యక్తిని, బయట పనులకు ఎక్కడికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండేవాడని, 6 మే 2024 తేదీన తల్లిదండ్రులు పనికి వెళ్లిన సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, తల్లిదండ్రులు చుట్టుపక్కల అంతా వెతికిన అతని ఆచూకీ లభించకపోవడంతో, యువకుని తండ్రి బెన్నుదాస్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఇన్స్పెక్టర్ తెలిపారు. బెన్నుదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# కరెంట్ షాక్‌తో తల్లికొడుకు మృతి

**మెదక్ :** కరెంట్ షాక్‌తో తల్లికొడుకు మృతి చెందిన విషాదం సంఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. శివ్వంపేట మండలం ఉసిరికపల్లిలో మణెమ్మ(45) మహిళ బట్టలు ఆరేయడానికి వెళ్లి కరెంట్ షాక్‌కు గురైంది. దీంతో తల్లిని కాపాడడానికి వెళ్లిన కొడుకు ప్రసాద్, కూతురు శ్రీలతకు కరెంట్ షాక్ తగిలింది.ఈ ఘటనలో తల్లికొడుకు అక్కడికక్కడే మృతి చెందగా.. కూతురు శ్రీలతకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు శ్రీలతను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కారు ఢీకొని వ్యక్తి మృతి



కొత్తూరు (ప్రశ్న న్యూస్) మండల కేంద్రంలో మేస్త్రి గా పనిచేస్తున్న ఉల్లిగడ్డల శ్రీను వయసు 43 సంవత్సరాలు తన సొంత గ్రామమము వట్టెం గ్రామం బిజినేపల్లి మండలం మహబూబ్నగర్ జిల్లా కు తన స్కూటర్ సైకిల్ పై కర్నూలు జిల్లాకు వెళ్తుండగా కొత్తూరు రైల్వే బ్రిడ్జిపై నందిగామ నుండి కొత్తూరు వస్తున్న షిఫ్ట్ డిజైర్ కారు ఏపీ 29 ఏఎఫ్ 8989 వేగంగా వచ్చి ఢీకొట్టడంతో రక్తపు గాయాలైన శివుడు నీ దగ్గరలోని షాద్నగర్ కమ్యూనిటీ హాస్పిటల్ కు తరలించగా, అక్కడ వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లుగా ధ్రువకరించాలని స్థానిక పోలీసులు తెలిపారు. మృతుని భార్య ఉల్లిగడ్డల సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ నరసింహారావు తెలిపారు.

# ఘనంగా జడ్పీ చైర్మన్ పుట్ట మధు జన్మదిన వేడుకలు

**పెద్దపల్లి** జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ జన్మదిన వేడుకలను అభిమానులు గురువారం తన నివాసమైన రాజగృహలో ఘనంగా నిర్వహించారు.మంథని ఎమ్మెల్యేగా పుట్ట పుట్ట మధుకర్ విజయం సాధించిన మే 16వ తేదీనే తన జన్మదినంగా జరుపుకుంటున్న సందర్భంగా పెద్దపెల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు తన అభిమానులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుట్ట మధుకర్ శైలజ దంపతులను అభిమానులు గజమాలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. జడ్పీ చైర్మన్ కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అరేపల్లి కుమార్, కాయితి సమ్మయ్య, గర్రెపల్లి సత్యనారాయణ, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు యెగోళపు శంకర్ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ మాచిడి రాజు గౌడ్, నాయకులు తగరం శంకర్ లాల్, బత్తుల సత్యనారాయణ, కనవేనా శ్రీనివాస్ యాదవ్, ఆసిఫ్ ఖాన్, ఇర్ఫాన్, తాటి సతీష్, పుప్పాల భాగ్యలక్ష్మి ,పద్మ , ఆడిచర్ల సమ్మయ్య తోపాటు అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రెయిన్ డెడ్... ఐదుగురి జీవితాల్లో వెలుగులు



**వనపర్తి** వనపర్తి నియోజకవర్గం శ్రీరంగాపురం మండలం కంబలాపురంలో ఓ మహిళ తాను చనిపోయి మరో ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపింది. లక్ష్మి దేవమ్మ (42) ఈనెల 5న కొడుకుతో కలిసి బైక్ పై వెళ్తుండగా మరో వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆమె నిమ్స్ లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ తో చనిపోయింది. ఈ క్రమంలో జీవన్ దాన్ వైద్య బృందం ఆమె భర్త, కుటుంబీకులకు అవయవ దానంపై అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో ఐదుగురి జీవితాల్లో వెలుగులు నిండాయి.

# యాదగిరిగుట్ట ని దర్శించుకున్న మాజీ మంత్రి హరీష్ రావు





**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సుదర్శన నారసింహ హెూమం లో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టిన బీఆర్ ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు. సన్మానం చేసిన బీఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య మైలార్ గూడెం గ్రామ ఉపసర్పంచ్ మా రెడ్డి కొండల్ రెడ్డి మాసాపేట గ్రామ శాఖ అధ్యక్షుడు గుణగంటి బాబు గౌడ్ యూత్ బీఆర్ ఎస్ నాయకుడు కరుణాకర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్ టౌన్ బీఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవ కార్యక్రమం

**చాగలమర్రి** 2024 సంవత్సరానికి టీబి అనగా క్షయ వ్యాధిని పూర్తిగా నియంత్రించడంలో భాగంగా పెద్దలకు క్షయ కార్యక్రమం మే 16 నుంచి మూడు నెలల పాటు ప్రతి గురువారం పెద్దలకు క్షయ టీ వేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం నాడు చాగలమర్రి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో 11వ వార్డులోని 18వ అంగన్వాడీ కేంద్రం నందు ఈ డెంగ్యూ దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. క్షయ వ్యాధిని నియంత్రించడంలో భాగంగా టీబి వ్యాధి ప్రబలకుండా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, గత ఐదు సంవత్సరాల నుంచి క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి, క్షయ వ్యాధిగ్రస్తులతో బాధపడుతున్న వారికి,, క్షయ వ్యాధిగ్రస్తులతో సంబంధం ఉన్నవారికి, పొగ త్రాగే వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, మరియు వయసుకు తగిన బరువు లేని వారికి, 18 సంవత్సరాలు నిండి ఉన్నవారికి, ఈ కార్యక్రమం ద్వారా బిసి జి టీకా వేయడం జరుగుతుంది. బాల్యం నుంచి ఈ టీకా వేయించుకున్న వారికి కూడా అదనంగా ఈ టీకాను వేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా చాగలమరి మండలంలోని 13 సచివాలయాల నందు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంజలి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్వైజర్ రామలింగారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సురేంద్ర, ఏఎన్ఎమ్ లు సిహెచ్ గార్లేట్, లక్ష్మీ ప్రసన్న, మరియు ఆశ వర్కర్లు పాల్గొనడం జరిగింది.

# భక్తులతో శ్రీశైలం వెళ్తున్న వాహనం బోల్తా.. 15 మంది తీవ్రం గాయాలు



**అమరావతి :** భక్తులతో శ్రీశైలం వెళ్తున్న వాహనం బోల్తాపడిన సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా దోర్నాల మండలం చిన్నారుట్ల చెంచుగూడెంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక సున్నివెంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కర్నూలు జిల్లా కోడమూరు మండలం పేలకుర్తి గ్రామానికి చెందిన 25 మంది భక్తులు రెండు వాహనాల్లో శ్రీశైలం దేవస్థానానికి వెళ్లారు. శ్రీశైలానికి 15 కిలో మీటర్ల దూరంలో ఓ వాహనం బోల్తాపడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

# సినీ ఫక్కీలో చోరీ

**శ్రీకాకుళం** శ్రీకాకుళం పట్టణంలోని దాసన్నపేట వద్ద సినీ ఫక్కీలో చోరీ జరిగింది. స్కూటీ డిక్కీలోని 3.50 లక్షలు గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు.దాసన్నపేటలో నివాసం ఉంటున్న సింగంశెట్టి శ్రీను బియ్యం వ్యాపారం చేస్తున్నాడు.ఇంటి పక్కనే ఉన్న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకులో 3.50 లక్షల నగదును విత్ డ్రా చేసి చేసి, తన స్కూటీలోని డిక్కీలో పెట్టి తాళం వేశాడు.

తన షాపునకు వెళ్లి అక్కడ స్కూటీని పార్కింగ్ చేశాడు. షాపులో బ్యాగులు తీసుకుని పది నిమిషాల తర్వాత స్కూటీ వద్దకు వచ్చేసరికి డిక్కీ తెరిచి ఉంది. అందులో పెట్టిన నగదు లేకపోవడంతో, లబోదిబోమంటూ కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి పరిసరాలను పరిశీలించారు. అనంతరం సమీపంలోని సిసి కెమెరాను పరిశీలించారు. బైక్‌పై ఒక బాలుడు వచ్చి స్కూటీ డిక్కీని ఓపెన్ చేసి నగదును అపహరించినట్లు రికార్డు అయింది. ఆ నగదుతో బాలుడు ఒడిశా వైపు వెళ్లినట్లు స్థానికులు చెప్తున్నారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## షరతులు లేని బోనస్ రైతులకు ఇవ్వాలి



**పెద్దపల్లి ప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికల అనంతరం 500 రూపాయలు బోనస్ ఇస్తానని ప్రకటించిన సీఎంరేవంత్ రెడ్డి ఎలాంటి షరతులు లేకుండా ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ చౌరస్తా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించి మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేఖ విధానాలను ప్రక్కన పెట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు 2500 ఇప్పటి వరకు అమలు చేయలేదని, అన్ని అమలు అయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలు ,రైతులు వెంటే ఉంటదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లు పొన్నమనేని బాలాజీ రావు, నూనెటి సంపత్, తానిపర్తి స్రవంతి మోహన్ రావు,మహిళా నాయకురాలు దాసరి ఉషా, మండల పార్టీ అధ్యక్షులు ఐరెడ్డి వెంకట్ రెడ్డి, బైరెడ్డి రాంరెడ్డి, మార్కు లక్ష్మణ్ , జిల్లా కో ఆర్డినేటర్ కొయ్యడ సతీష్, పట్టణాధ్యక్షులు ఉప్పురాజ్ కుమార్, పాక్స్ ఛైర్మెన్ లు ,వైస్ ఎంపీపీ లు,గౌరవ కౌన్సిలర్ లు,ఎంపీటీసీ లు,మాజీ సర్పంచ్ లు, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# రైతులను ఆదుకోవాలి

### - ఆర్డీవోకి వినతిపత్రం ఇచ్చిన బీఆర్ఎస్ నేతలు

**భైంసా** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేతలు ఆర్డీఓ కు వినతిపత్రం అందజేసారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులు పండించిన ధాన్యం పై 500 రూపాయల బోనస్, కొనుగోలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎలక్షన్ మీద పెట్టిన దృష్టి రైతుల ధాన్యం మీద కొనుగోలు చేయడం లేదని అకాల వర్షాలతో రాత్రి పగలు అనకుండా కష్టపడి పండించిన పంట వర్షానికి తరిసి ముద్దయిపోతుంది. కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి వరి ధాన్యాలు కొనుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో టిఆర్ఎస్ పార్టీన భారీ ఎత్తున ధర్మాలు రాస్తారు అని అన్నారు

## రైతులను మరచిపోయిన సీఎం రేవంత్

**అదిలాబాద్** కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన వాగ్దానాన్ని సీఎం రేవంత్ రెడ్డి విస్మరించి మోసం చేస్తున్నారని మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నారు.ఎన్నికలకు ముందు ప్రతీ సభలో రైతులు పండించిన వరి ధాన్యానికి 500 ల రూపాయల బోనస్ ఇస్తానని ఇప్పుడు సన్న వరి ధాన్యానికి మాత్రమే ప్రభుత్వం బోనస్ ఇస్తామని అనడం సరికాదన్నారు.బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని ఖండిస్తూ గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు బాబు జగ్జీవన్ రామ్ చౌక్ వద్ద రహదారిపై వడ్లను నేలపై వేసి నిరసన వ్యక్తం చేశారు.. అనంతరం మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ రాష్ట్రంలో 80 శాతం రైతులు దొడ్డు వడ్లను పండిస్తారని,20 శాతం పండిస్తున్న సన్న వడ్లకు 500 ల బోనస్ ఇస్తామని అనడం సరికాదని,అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లిస్తామని ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మాటమార్చడం పట్ల మండి పడ్డారు .దొడ్డు వడ్లు పండించిన పంటలకు కూడా 500 ల రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో బీఆర్ ఎస్ పార్టీ రైతుల పక్షాన ఉండి వారికి న్యాయం జరిగేంతవరకు పోరాటాలు చేస్తామని తెలియజేశారు.

## కాటారం మండలంలో కలెక్టర్ పర్యటన



**జయశంకర్ భూపాలపల్లి :** పాఠశాలలు పున ప్రారంభం నాటికి విద్యార్థులకు ఏక రూప దుస్తులు పంపిణీ జరగాలని జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కాటారం మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనంలో జీవన జ్యోతి మండల సమాఖ్య మహిళ సంఘ సభ్యులు కొడుతున్న విద్యార్థుల ఏక రూప దుస్తుల కుట్టు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫామ్ లు అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. మండలంలోని మొత్తం 49 మండల పాఠశాలలకు గాను 901 మంది బాలురు, 988 మంది బాలికలతో కలిపి మొత్తం 1889 విద్యార్థులకు 3,878 యూనిఫామ్ లు తయారీకి జీవన జ్యోతి మండల సమాఖ్య సబ్యులకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇట్టి యూనిఫాంల తయారీ జూన్ 10 వ తేదీలోగా అందించాలని, జూన్ 12 నుండి పాఠశాలలు పున ప్రారంభం కానున్న నేపథ్యంలో జూన్10 వ తేదీ లోపు బాల, బాలికలకు యూనిఫామ్ లను అందించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. శిక్షణ పొందిన సమాఖ్య మహిళ సభ్యులు విద్యార్థుల కొలతల ఆధారంగా యూనిఫాంలను కుట్టాలని అన్నారు. యునిఫామ్ తయారీలో నాణ్యమైన మెటీరియల్ వినియోగించాలని సూచించారు. యూనిఫామ్ ధరించిన పిల్లలు నూతన ఉత్సాహంతో, తేజరిల్లేలా అంత ఖచ్చితంగా విద్యార్థులకు దిద్దినట్లు తయారు చేయాలని కలెక్టర్ అన్నారు. పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా కొలతలు 5 గురు చొప్పున భిన్నమైన సైజ్ కొలతలు బేరుజు చేసుకొని మరి బిగుతుగా కాకుండా వదులుగా ఉండే విధంగా యూనిఫామ్ లను కుట్టాలని సమాఖ్య సభ్యులకు కలెక్టర్ సూచించారు. ఈ సీజన్ పూర్తి అవగానే మహిళ గ్రూప్ సబ్యులకు చేయూత కలిపించడానికి ప్రభుత్వ పరమైన యూనిఫామ్ ల తయారీని ప్రభుత్వం మహిళ సంఘాలకు అప్పగించే ఆలోచనలో ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా యూనిఫామ్ ల తయారీ విధానాన్ని, బట్ట నాణ్యతను పరిశీలించి మహిళా సమాఖ్య సబ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ నరేష్, తహసిల్దార్ నాగరాజు, ఎం పి డి ఓ బాబు, ఎంపిఓ ఉపేంద్రయ్య, యూనిఫామ్ కుట్టు శిక్షకురాలు వనిత, జీవన జ్యోతి మండల సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఆనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కాటారం మండలంలోని పోతులవాయి, బయ్యారం గ్రామాల్లో ఎం పి పి యస్ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్12 వ తేదీన పాఠశాలలు ప్రారంభం కానున్నందున పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని, పనుల్లో పెండింగ్ ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. పనులు నిరంతరయంగా జరిగేందుకు ఇప్పటికే 20 శాతం నిధులు విఓ, విఏఓ జాయింట్ అకౌంట్లో జమ చేశామని అన్నారు. నిధుల కొరత లేనందున చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేసి అంచనా వ్యయాన్ని సంబంధిత ఎంపిడిఓలకు అందచేయాలని తద్వారా మిగిలిన మొత్తాన్ని మీ బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని సంబంధిత విఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బాబు, పంచాయతీ రాజ్ డి ఈ సాయిలు, రెండు గ్రామాల విఓ లు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ మూకల చేస్తున్న దాడులు, అరాచకాలు

## దౌర్జన్యాలపై గవర్నర్‌కు ఎన్డీఏ నేతల ఫిర్యాదు

- ఓడిపోతున్నామని భయంతోనే జగన్ రెడ్డి చేయిస్తున్న దాడులు ఇవి ఇన్ని అరాచకాలు జరుగుతున్న చోద్యం చూస్తున్న పోలీసులు
- ఐదేళ్ల హింస రాజకీయానికి ప్రజలు స్వస్తి చెప్పారు
- దాడులు దౌర్జన్యాలను ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి, శాంతి పద్ధతులను పునరుద్ధరించాలి -ఎన్డీఏ నేతలు



**అమరావతి** రెండు రోజులుగా రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న దాడులు దౌర్జన్యాలు అరాచకాలపై గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ గారికి ఫిర్యాదు చేసిన కూటమి నేతలు. ఓడిపోతున్నామని భయంతోనే అధికార వైసిపి ఈ దాడులు చేయిస్తుందని గవర్నర్ కు కూటమి నేతలు తెలియజేశారు. వీటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, నశించిపోయిన శాంతి భద్రతలను తిరిగి పునరుద్ధరించాలని కూటమి నేతలు గవర్నర్ ను కోరారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడుతూ....వర్ల రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ అరాచకాలనీ ఎదుర్కొని ఓటు హక్కును వినియోగించుకున్నవారందరికి కూటమి తరపున కృతజ్ఞతలు. రాష్ట్రంలో నశించిన శాంతిభద్రతలు, ప్రభుత్వ దౌర్జన్యాలు, మా పై జరిగిన అరాచకత్వాన్ని గవర్నర్ కు వివరించాం. పోలీసులు, పోలీసు అధికారులు వ్యవహరించిన తీరు గురించి చెప్పాం. మాచర్ల, తాడిపత్రి, చంద్రగిరి, పూతలపట్టు, నరసరావుపేట ఇలా అనేక చోట్ల పోలీసులు వైకాపాతో మిలాఖాత్ అయి టీడీపీ నాయకులపై, ప్రజలపై దాడులు, దౌర్జన్యాలు చేశారు. వీటన్నిటిపైనా చర్యలు తీసుకోవాలి అని గవర్నర్ ను కోరాము. రాడ్లు, కర్రలు, పెట్రోల్ క్యాన్లతో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా తిరుగుతుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారు. ఆధారాలతో సహా గవర్నర్ కు సమర్పించాం. గవర్నర్ కూడా ఆశ్చర్యపోయారు. పిన్నెల్లి సోదరులు చేసిన అరాచకం సినిమాలను తలపించేలా ఉన్నాయి. కళ్ళకు కట్టినట్లుగా గవర్న్ గారికి చూపించాం. వైసీపీకి ఓటు వేయలేదా కొట్టండి అని, వీడు మన పార్టీ కాదు కొట్టండని వైసీపీ మూకలు దాడులు చేశారు. వాళ్ళు చేసిన దౌర్జన్యాలు అన్నీ ఇన్ని కావు. వీరి దౌర్జన్యాలు చూస్తుంటే మనం భారతదేశంలో ఉన్నామా లేక ఇస్లామిక్ దేశంలో ఉన్నామా అని అనుమానం కలుగుతోంది. చంద్రగిరిలో పులివర్తి నాని ని కొట్టి చంపడానికి ప్రయత్నించారు.

తాడిపత్రిలో పెద్దారెడ్డి ఇష్టం వచ్చినట్లు వ్యవహరించాడు. వీటన్నింటిపైన తప్పకుండా చర్యలు తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఇలాంటివి జరగకుండా చూస్తానని కూడా గవర్నర్ హామీ ఇచ్చారు. గవర్నర్ చాలా సౌమ్యంగా వ్యవహరించారు. ఆయన దృష్టికి ఇలాంటివి అనేకం వచ్చినట్లు చెప్పారు. అసమర్ధ పోలీసుల పైన కూడా చర్యలు తీసుకుంటామన్నారు. అధికార పార్టీతో ఎవరు లాలూచీ పడ్డారో, చేతులు కలిపారో ఆ పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటామని గవర్నర్ అన్నారు. ఎవరైతే ఎన్నికల విధులను లోపభూయిష్టంగా వ్యవహరించారో వారందరిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన హామీ ఇవ్వడంతో మేము చాలా సంతోషించాం జగన్మోహన్ రెడ్డి ఆటలు ఇక సాగవు" అని వర్ల హెచ్చరించారు.

# ఎన్నికల్లో ఎన్ఆర్ఐల కృషి అనన్యసామాన్యం

- సప్తసముద్రాలు దాటొచ్చి పోలింగ్‌లో పాల్గొన్న వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు
- ఎన్ఆర్ఐ టీడీపీ నేతలకు చంద్రబాబు కితాబు - పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ఎన్ఆర్ఐ గ్రాట్యుటీ డిన్నర్ కార్యక్రమం
- జూమ్ కాల్ ద్వారా పాల్గొని ఎన్ఆర్ఐల సేవలను కొనియాడిన టీడీపీ అధినేత చంద్రబాబు



ఏపీలో మే 13వ తేదిన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రవాసాంధ్రులు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి పోలింగ్ ప్రక్రియలో భాగస్వామ్యంకావడం అనన్యసామాన్యమని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. మేము సైతం అంటూ వివిధ దేశాల్లో స్థిరపడ్డ ఎన్ఆర్ఐలు ఏపీకి చేరుకుని దాదాపు నెల రోజులుగా ఎన్డీయే కూటమి గెలుపు కోసం పనిచేయడం అద్వితీయమని, వారి సేవలు మరవలేనివని కొనియాడారు. మంగళవారం సాయంత్రం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ వేమూరి రవి, గల్ఫ్ టీడీపీ అధ్యక్షుడు రావి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఆర్ఐ గ్రాట్యుటీ డిన్నర్ కార్యక్రమంలో అధినేత చంద్రబాబునాయుడు జూమ్‌కాల్ ద్వారా పాల్గొని ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎన్డీయే కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా... ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పలువురు ఎన్ఆర్ఐలు ఆసక్తి చూపించారు. వెంకట్ కోడూరి, మాలేపాటి సురేష్ తదితరులు ఎన్నికల వేళ తాము నిర్వహించిన విధులు, పోలింగ్ సరళిని చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా అధినేత చంద్రబాబు మాట్లాడుతూ... ఓటుహక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకొన్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని, అలా ఏపీలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం కోసం దేశవిదేశాల్లోని ఎన్ఆర్ఐలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక పాలసీ తీసుకొచ్చి ఎన్ఆర్ఐల సమస్యల కోసం పనిచేస్తామన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఐల సంక్షేమంపై దృష్టిపెట్టకపోవడంతో వారిద్వారా రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలు రాకుండా ఆగిపోయాయని, గల్ఫ్ దేశాల్లోని ఎన్ఆర్ఐలు ప్రమాదం బారినపడితే రూ.లక్ష, ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.10 లక్షలు, అక్కడ వారికి ఏదైనా న్యాయ సమస్యలు తలెత్తితే రూ.50 వేల వరకు అందేలా నాడు టీడీపీ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని చంద్రబాబు గుర్తు చేశారు. ఏపీ ఎన్ఆర్టీ విభాగం కింద టీడీపీ హయాంలో ఇమ్మిగ్రేషన్, ఇతర సమస్యలతో ఇబ్బంది పడేవారిని స్వదేశాలకు తరలించడంతోపాటు దుబాయ్ తదితర గల్ఫ్ దేశాల్లో ఉద్యోగ, ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించడం కోసం తమ ప్రభుత్వం రెండు శిక్షణ కేంద్రాలు నిర్వహించిందన్నారు. మన రాష్ట్రం నుంచి ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వారికి మంచి వేతనం లభించేలా, వారికి శిక్షణ అందించేలా సదరు కేంద్రాలను నడపడం జరిగిందన్నారు.

నాడు టీడీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఐల కోసం చేపట్టిన కార్యక్రమాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్ఆర్ఐల సంక్షేమం కోసం కృషి చేస్తామని, నేరుగా తనను కలిసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏపీ భవిష్యత్తు కోసమే తాము కుటుంబ సభ్యులతో సహా స్వచ్ఛందంగా ఏపీకి తరలివచ్చి ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నామని, స్వయంగా ఓటు వేయడం సంతోషంగా ఉందని పలువురు ఎన్ఆర్ఐలు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, కూటమి గెలుపు ఏపీకి మలుపు కాబోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యాలయ కార్యనిర్వహక కార్యదర్శి పి.అశోక్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బుచ్చిరాం ప్రసాద్, గన్నవరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, పెనమలూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోడె ప్రసాద్, గుంటూరు మిర్చియార్డ్ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ మహిళా చైరపర్సన్ నన్నపనేని రాజకుమారి, అమెరికా ఎన్ఆర్ఐ టీడీపీ కోఆర్డినేటర్ కోమటి జయరామ్, అరవింద్ వేమూరు, చప్పిడి రాజశేఖర్ లతో పాటు సుమారు 500 మంది ఎన్ఆర్ఐలు పాల్గొన్నారు.

## ఓటమి భయంతో

# వైసిపి దాడులు

### - బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి దినకర్

**విజయవాడ** పోలింగ్ జరిగే సమయంలో అత్యధిక పోలింగ్ నమోదు అవ్వడం చూసి ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధమయ్యారని తెలుసుకున్న జగన్మోహన్ రెడ్డి హింసను ప్రేరేపించారు. పోలింగ్ శాతాన్ని తగ్గించడానికి ప్రయత్నించారు. ప్రజలు ఈ రాక్షస పరిపాలనకు చరమగీతం పాడాలని నిర్ణయించుకున్నారు. 82% ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడం సంతోషదాయకం. ఇది ప్రజాస్వామ్య విజయం. పోస్ట్ వైలెన్స్ సృష్టించారు. ఓటింగ్ శాతం తగ్గించడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. కూటమి భారీ విజయం సాధించబోతుందని వైసీపీ నాయకులు ఎప్పుడైతే తెలుసుకున్నారో టీడీపీ నాయకులపై దాడులకు తెగబడ్డారు. తిరుపతిలో పులవర్తి నాని మీద దాడి జరిగింది. హతమార్చాలని ప్రయత్నించారు. దర్శి లో హింసను ప్రేరేపించారు. తాడిపత్రిలో పోస్ట్ పోల్ వైలెన్స్ సృష్టించారు. పెద్దారెడ్డి అనేక అరాచకాలు సాగించారు. ఇవన్నీ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. గవర్నర్ గారు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి, డీజీపీకి సమన్లు వచ్చాయి. గవర్నర్ కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో ఆర్థిక పరమైన విషయాల్లో అస్తవ్యస్తం జరిగింది. 14,200 కోట్లు పేదలకు దక్కాల్సిన దాన్ని బూచిగా చూపి ఎన్నికల ముందు లబ్ది పొందాలని చూశారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 14వ తర్వాత దాన్ని ఇవ్వాలని చెప్పారు. ఓడిపోతున్నమని తెలిశాక వాళ్ళ మిత్రులందరికీ కాంట్రాక్టుకు దోచిపెట్టే ప్రయత్నం చేశారు. కూటమి విజయం సాధించినట్లయింది. కాంట్రాక్టుల జేబుల్లోకి వెళ్లే నిధుల్ని ప్రజలకు అందేలా చేశాం. గవర్నర్ గారు మా వినతుల్ని నిశితంగా పరిశీలించారు. న్యాయం చేసే విధంగా అడుగులు వేస్తున్నారు" అని దినకర్ అన్నారు.

## పోలీసుల హింసను ప్రేరేపించారు

### - జనసేన నేత చల్లపల్లి శ్రీనివాసరావు

**విజయవాడ** రాష్ట్ర ప్రజలందరూ ధర్మాన్ని నిలబెట్టాలి. మంచినీ గెలిపించాలని నినాదంతో కోట్లాదిమంది ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని ఓట్లు వేయడం జరిగింది. దీన్ని జీర్ణించుకోలేని వైసిపి గతి తప్పి, మతి తప్పి ప్రవర్తిస్తోంది. ఎక్కడపడితే అక్కడ అల్లర్లు సృష్టించింది. ఎన్నికలు సజావుగా జరగకుండా చూడడానికి అనేక ప్రయత్నాలు చేశారు. ఫెయిలయ్యారు. రకరకాల హింసలకు ప్రేరేపించారు. వీటన్నిటిని ఎన్ డి ఏ కూటమి తరపున గవర్నర్ గారికి విన్నవించడం జరిగింది. తప్పనిసరిగా యాక్షన్ తీసుకుంటామన్నారు. పేదలకు అందాల్సిన డబ్బు 14వ తేదీన అందించండి అని ఎన్నికల కమిషన్ చెప్పింది. అయితే ఇంతవరకు చర్యలు లేవు. ఆ డబ్బు వెంటనే ప్రజలకు అందేలా చూడాలని రిక్వెస్ట్ చేసుకుంటున్నాం" అని కోరారు.

### ఈసిఐ వివరణ ఇవ్వడానికి

## ఢిల్లీకి వెళ్లిన ఏపీ సిఎస్, డిజిపి

**అమరావతి** ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి కెఎస్. జవహర్ రెడ్డి, డిజిపి హరీశ్ కుమార్ గుప్తా భారత ఎన్నికల సంఘానికి(ఈసిఐ) వివరణ ఇవ్వడానికి గురువారం ఢిల్లీకి వెళ్లారు. వారితో పాటు అదనపు డైరెక్టర్ జనరల్ కుమార్ విశ్వజీత్ కూడా వెళ్లారు.

ఆంధ్రప్రదేశ్ లో సోమవారం పోలింగ్ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై వారు వివరణ ఇవ్వనున్నారు.హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా వారెందుకు నివారించలేకపోయారో వివరించాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, లోక్ సభ ఎన్నికలు ఒకే దఫాలో నిర్వహించగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. దీనిపై ఎన్నికల సంఘం సీరియస్ గా ఉందని వినికిడి. మాచర్ల, నరసారావుపేట్, తాడిపత్రి నియోజకవర్గాల్లో హింసాత్మక ఘటనలు ఘోరంగా జరిగాయి. ఈవిఎం లను ఎవరు ధ్వంసం చేశారో వారందరిపై కేసులు బుక్ చేయాల్సిందిగా ఈసిఐ ఆదేశించిందని చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ ముకేశ్ కుమార్ మీనా తెలిపారు.

# బీజేపీలో జోష్ నింపిన పార్లమెంట్ ఎన్నికలు

**- పెద్దపల్లి సీటు పక్కా బీజేపీదే అంటున్న సర్వేలు - బీజేపీకి కలిసి వచ్చిన ఓటు క్రాసింగ్**
**- గ్రామాల్లో వెలిగిన మోడీ చరిష్మా - మోడీకి కానుకగా పెద్దపల్లి పార్లమెంట్ స్థానం**
**- బీజేపీ గెలిస్తే ఢిల్లీ దాకా మారు మ్రోగనున్న పెద్దపల్లి కీర్తి**

**పెద్దపల్లి ప్రతినిధి :** పార్లమెంట్ లోక్ సభ ఎన్నికలు ఈసారి బీజేపీ పార్టీలో జోష్ పెంచిందనే చెప్పాలి. ఇందులో ప్రధానంగా పెద్దపల్లిలో జరిగిన ఎన్నికలు మరి మరి విశేషంగా చెప్పవచ్చు. ఈసారి జరుగుతున్న ఎన్నికలు ఒకవైపు హిందుత్వవాదం పేరుతో మరోవైపు లౌకికవాదం పేరుతో జోరుగా ప్రచారాలు సాగిస్తున్నాయి ఆయా పార్టీల నాయకులు. ఇక అసలు విషయానికి వస్తే పెద్దపెల్లి పార్లమెంటు చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి ఎన్నికలు జరిగాయి. ఓటింగ్ శాతం తీసుకుంటే వందకు 60 మంది ఓటు వేసినా ఇందులో ప్రధానంగా చెప్పుకోవాల్సిన విశేషమేంటంటే మూడోతరం నాయకుడైన గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం. 24 ఏళ్ల యువకుడు ఇద్దరు ఉద్దండులు, గుర్తింపు ఉన్న పార్టీలతో తలపడ్డారు. ఇటు టీఆర్ ఎస్ నుండి కాకలు తీరిన ఉద్యమ బిడ్డ, మాజీ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, మరో వైపు బీజేపీ బ్రాండ్, మోడీ చరిష్మా తో మరో సారి తన అదృష్టం పరీక్షించు కుంటున్న గోమాస శ్రీనివాస్. వీరిలో ఎవరికి వారే పలు ప్రత్యేకతలు ఉన్నా, ముఖ్యంగా ఇక్కడ చర్చించుకోవాల్సింది పార్టీల గురించే. ఇద్దరూ సీనియర్ నాయకుల మధ్యలో ఒక యువ నాయకత్వం గెలుపు ఓటమిలో నిర్ణయించే ఓటర్ల మధ్యలో నిలబడి ఓటు వేసిన గెలుపు కోసం వేచి చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా మతతత్వ బీజేపీ పార్టీ అంటూ ప్రచారం చేస్తే, బీజేపీ మాత్రం అభివృద్ధి మీదనే ప్రచారం దృష్టి సారించింది. ఇక సోషల్ మీడియా మాత్రం అన్ని మసాలలతో ఘాటుగా ప్రచారం చేసిందనే చెప్పాలి. ఇక మోడీని చూసే ఓటు వేయాలని చేసిన ప్రచారం కూడా గ్రామాల్లో సైతం బలంగా నాటుకు పోయింది. అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రస్తుతం పెద్దపల్లిలో బీజేపీలో వర్గ పోరు కనిపించినా అది ఈసారి ఓటర్లను ప్రభావితం చేయలేక పోయింది. పెద్దపల్లిలో బీజేపీ గెలుపు ఖాయమే అనే స్థాయిలో ప్రచారం జోరుగా సాగింది. అలాగే ప్రాంతీయ పార్టీ అయిన టీఆర్ ఎస్ కు బలం ఉన్నా, కేంద్రంలో ఏమి చేస్తుందనే భావన స్థానిక ఓటర్లలో కనిపించింది. యువకులు గ్రామీణ ప్రాంతం ప్రజలు కొంత వరకు బీజేపీకి ఓటు వేశారు. దీనికి తోడుగా శ్రీరామ అక్షింతల సెంటిమెంట్, హిందూ త్వ వాదన కూడా ప్రజల్లోకి చొచ్చుకు పోయింది. దీంతో కాంగ్రెస్, టీఆర్ ఎస్ అనే పార్టీలతో సంబంధం లేకుండా ఏక పక్ష తీర్పు ఇవ్వనున్నట్లు ఓటింగ్ సరళిని చూస్తే అర్ధమవుతుంది. 17 లోక సభ ఎన్నికలు ఒక ఎత్తు అయితే ఈ ఎన్నికలు మరో ఎత్తుగా నిలిచాయి. గత లోక్ సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ తరుపున గోమాస శ్రీనివాస్ ప్రభావం చూపించినా, టీఆర్ ఎస్ సెంటిమెంట్ ముందు ఓటమి ముంగిట నిలిచారు. కానీ ఇప్పటి పరిస్థితులు మరోలా మారి, బీజేపీ లేపిన సెంటిమెంట్ తో గోమాస బయట పడే అవకాశం 90 శాతంగా ఉన్నాయి. అసలు బీజేపీ ప్రభావం లేదని, గ్రూప్ తాగదాలతో గెలవదు అనే స్థాయి నుండి అందరి చూపు పెద్దపల్లి పార్లమెంట్ పై దృష్టి సారించేలా చేశాయి. ఈసారి గెలిస్తే గోమాసకు మంత్రి పదవి ఖాయంగా చర్చలు జోరందుకున్నాయి. పెద్దపల్లి మరోసారి ఢిల్లీలో వార్తల్లోకి రానున్నదని రాజకీయ విశ్లేషకుల భావన. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా ఉన్నా, ఓటర్ల తీర్పును అందరు గౌరవించాల్సిందే.... కాగా మరో ఇరవై రోజుల్లో నాయకుల భవిష్యత్ తెలనున్నది.

## స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రత

**ఖమ్మం** స్ట్రాంగ్ రూం ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. రిటర్నింగ్ అధికారి, ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూం లను సందర్శించి, భద్రతను పరిశీలించారు. 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూం లను పరిశీలించి, విధుల్లో ఉన్న సాయుధ బలగాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూం ల వద్ద ఏర్పాటుచేసిన లైట్లు 24 గంటలు ఆన్ లో ఉంచాలన్నారు. స్ట్రాంగ్ రూం సిసి కెమెరాల వ్యూ కోసం ఏర్పాటుచేసిన ఎల్ఇడి తెరలను పరిశీలించి, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్ట్రాంగ్ రూం ల పరిశీలనకు ఎంట్రీ పాస్ ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లకు అనుమతించాలని ఆయన తెలిపారు. కౌంటింగ్ రూం ల ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా వుంటూ, భద్రతా చర్యలు చేపట్టాలని రిటర్నింగ్ అధికారి అన్నారు.

## రాయల అంతియయాత్రలో పాల్గోన్న నామా

**ఖమ్మం** తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో మాజీ డిసిఎంఎస్ఎస్ ఛైర్మన్ రాయల వెంకట శేషగిరి అంతిమయాత్ర పాడే మోసి అంతిమయాత్రలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు,రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు పాల్గొన్నారు. అతిమయత్రలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గోన్నారు. ఈ సందర్భంగా నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ..మంచి వ్యక్తిని కోల్పోయామని,రాయల మృతితో ప్రతి శ్రేణులకు తీరని లోటన్నారు.

## ఆర్టీసీ బస్సుపై యువకుల దాడి

**కల్వకుర్తి** గురువారం ఉదయం కల్వకుర్తి ఆర్టిసి బస్సు పై కొంతమంది దుండగులు అమానుషంగా బస్సు అద్దాలు, ప్రయాణికులపై దాడి చేసారు. ఘటనలో బస్సు అద్దాలు పగిలిపోయాయి. . ఈ సంఘటనపై పోలీసు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. చాలామంది ఒక వర్గానికి చెందిన యువకులు కత్తులు తల్వార్ల తో రోడ్డుపై నాన హంగామా సృష్టించి బస్సు పై దాడి చేసారని వారు ఆరోపించారు.

## పోలీసు జవాను ఆత్మహత్య

**శ్రీశైలం** శ్రీశైలం పోలీస్టేషన్ లో కానిస్టేబుల్ గన్ తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీశైలంలో స్దానికులను పోలీసులను ఒక్కసారిగా ఉలిక్కిపడేటట్లు చేసింది.శ్రీశైలం పోలీస్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న శివశంకర్ రెడ్డి ఇవాళ తెల్లవారుజామున సుమారు ఐదు గంటల సమయంలో స్టేషనులోని రెస్ట్ రూములో సర్వీస్ గన్ తో తలకు కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు శ్రీశైలం పోలీసులు చర్చించుకుంటున్నారు.కానిస్టేబుల్ శివశంకర్ రెడ్డి స్వగ్రామం కర్నూలుగా పోలీసులు గుర్తించారు.అయితే ఆత్మహత్యకు గల కారణాలు పోలీసులు విచారణ చేస్తున్నారు కానిస్టేబుల్ శివశంకర్ రెడ్డి 2001వ బ్యాచ్ గా పోలీసులు తెలిపారు.శివశంకర్ రెడ్డి ఆత్మహత్య తెలుసుకున్న వార్త తెలియగానే శ్రీశైలం పోలీసుల్రగ్భాంతికి గురయ్యారు సిఐ ప్రసాదరావు హుటాహుటిన స్టేషను కు చేరుకుని ఘటన స్దలాన్ని పరిశీలించారు.మృతి చెందిన శివశంకర్ రెడ్డి కుటుంభికులకు సమాచారం తెలిపారు విషయాన్ని ఉన్నతస్దాయి అధికారులకు తెలిపామని సిఐ అన్నారు. శివశంకర్ రెడ్డి (46) కానిస్టేబుల్ గా శ్రీశైలం పోలీస్టేషన్ లొ విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు ఆత్మహత్య వీడియోలను చిత్రీకరించేందుకు పోలీసులు మీడియాను నిరాకరించారు.డిఎస్పి శ్రీనివాసరావు శ్రీశైలం చేరుకున్న తరువాత మీడియాను అనుమతిస్తామని సిఐ ప్రసాదరావు అన్నారు.

## రైల్వే కోడూరులో అంగరంగ వైభవంగా గంగమ్మ జాతర

**అన్నమయ్య** రైల్వే కోడూరు పట్టణంలో బలిజ వీధిలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా జరుగుతున్నది. ఇందుకు సంబంధించి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. జాతరకు ముందు రోజున అనేక రకాల దేవతల వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణాన్ని విద్యుత్ దీపాలతో సుందరీకరంగా అలంకరించారు. గురువారం ఉదయం అమ్మవారిని తయారు చేసుకుని ఊరేగింపుగా నలువీధులలో తిప్పుకుంటూ గుడి వద్దకు తీసుకువచ్చి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అమ్మవారిని దర్శించుకొనుటకు ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేశారు. భక్తులకు కావలసిన అన్ని రకాల వసతులను భారీ బందోబస్తులను ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ పోకల సుబ్బరాయుడు తెలియజేశారు.

## కైరేవులో ఎలుగు బంటి సంచారం

**అనంతపురం** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం శెట్టూరు మండలం, కైరేవు గ్రామం లో ఎలుగు బంటి హల్ చల్ చేసింది. గురువారం ఉదయం పొలం లో పనిచేస్తున్న ఇద్దరు రైతులు మీద దాడి చేసినట్టు సమాచారం.. - పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది

## అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

**రంపచోడవరం** రంపచోడవరం మండలం ఫోక్స్ పేట చెక్పోస్ట్ వద్ద తాబేళ్లను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఫారెస్ట్ అధికారులు. మైదాన ప్రాంతమైన రామచంద్రపురం నుండి ఏజెన్సీ మీదుగా ఒడిశా ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఫోక్స్ పేట అటవీశాఖ తనిఖీ కేంద్రం వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా తాబేళ్లు అక్రమ రవాణా చేస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు రేంజ్ అధికారి కరుణాకర్ తెలిపారు. పట్టుబడ్డ వాహనంలో 30 బస్తాల్లో సుమారు 1000 వరకు తాబేళ్లు ఉన్నాయని చెప్పారు.

## ఆరటికి ధర లేక రైతుల అందోళన

**కోనసీమ** గోదావరి జిల్లాలో అరటి కి ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి రాని పరిస్థితి ఉండడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో అరటి రైతులు ఉన్నారు. ఎండల తీవ్రతకు అరటి గెలలు మాగిపోతున్నాయి. గోదావరి జిల్లాలో లంక భూములతో పాటు కొబ్బరి తోటల్లో అంతర పంటగా అరటి సాగు అధికంగా చేస్తారు. రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద అరటి మార్కెట్ గా రావులపాలెంలోని అరటి మార్కెట్ కు పేరు. రావులపాలెం అరటి మార్కెట్ కు ప్రతిరోజు 25000 అరటి గెలలు వస్తాయి.ఇక్కడి నుంచి రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు బెంగళూరు మహారాష్ట్ర ఒరిస్సా తదితర ప్రాంతాలకు ఎగుమతి జరుగుతాయి. ప్రస్తుతం మార్కెట్లో సైకిల్ లోడు 300 రూపాయలకు రైతు వద్ద కొనుగోలు చేస్తుండడంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంక్షోభం నుండి రైతులు బయటపడాలంటే ప్రభుత్వం ఎరువులను సబ్సిడీపై అందించాలని అరటి రైతులు కోరుతున్నారు.

## పల్నాడు జిల్లాలో పోలీసుల తనిఖీలు

**- నాటు బాంబులు.. పెట్రోల్ బాంబులు గుర్తింపు**

**పల్నాడు** గురజాల నియోజకవర్గం పిన్నెల్లిలో బాంబులు కలకలం రేపాయి. వైకాపా నేతల ఇళ్లలో నాటు బాంబులు, పెట్రోల్ బాంబులను పోలీసులు గుర్తించారు. ఇటీవల జరిగిన ఎన్నికలు సంబంధించిన గొడవలపై విచారణకు పోలీసులు గ్రామానికి వెళ్లగా వైకాపా, తెదేపా నేతలను అదుపులోకి తీసుకునే క్రమంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వైకాపా నేతల ఇళ్లలో బాంబులను గుర్తించినట్లు సమాచారం.

## వండాడిపై జరిగిన దాడికి టీడీపీకి సంబంధం లేదు

**రాయచోటి** తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. చిన్నమండెం.మండలం బోడి రెడ్డి గారి పల్లెలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్ రెడ్డి తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నిన్న జరిగిన వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు వండాడి వెంకటేశ్వర్లు ఇంటి పై దాడి చేసిన ఘటనలో తెలుగుదేశం పార్టీ నాయకులకు ఎటువంటి సంబంధం లేదని వైఎస్ఆర్సిపి పార్టీ ఓటమి భయంతోనే జరిగిన ఎలక్షన్ బూతులు వద్ద వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు వండాడి వెంకటేశ్వర్లతో కలసి దౌర్జన్యాలకు పాల్పడ్డారని. వండాడి వెంకటేశ్వర్లు ఒక భూకబ్జాదారుడని. బిసి వర్గాలకు చెందిన పేదవారు భూములను దౌర్జన్యంతో కబ్జా చేశారని. ఆ భూములు పోగొట్టుకున్న వారే ఉండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేశారని రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎన్నికల ఫలితాలలో రాయచోటిలో గొప్పమెజారిటీతో గెలుస్తుందని అన్నారు.ఓటమి భయంతోనే రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఈ దాడులు చేయిస్తున్నారని రాంప్రసాద్ రెడ్డి మీడియా సమావేశంలో అన్నారు...

## వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించాలి



వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మంథని బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు గురువారం మంథని అంబేద్కర్ చౌక్ లో రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా, రాష్ట్ర రైతాంగానికి మద్దతుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి, రోడ్డు పై మంథని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. బేషరతుగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం వరి ధాన్యం మద్దతు ధరపై రూ. 500 బోనస్ చెల్లించి అన్ని రకాల వడ్లను కొనాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు యెగోళపు శంకర్ గౌడ్, కౌన్సిలర్ కాయితి సమ్మయ్య, నాయకులు బత్తుల సత్యనారాయణ, ఎరుకల రవి, మాచిడి సత్యనారాయణ గౌడ్, పుప్పాల తిరుపతి లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## ఈనెల 20 నుంచి యాదాద్రిలో నరసింహుడి జయంతి ఉత్సవాలు

**యాదాద్రి** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుంది. 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు మూడు రోజులపాటు నిత్య కళ్యాణాలు నిత్య హోమాలు శాశ్వత కళ్యాణాలను రద్దు చేస్తున్నారు అధికారులు. ఘనంగా జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లక్ష్మీనరసింహస్వామి వారి అనుబంధ దేవాలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయము లో కూడా జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుంది. ఉదయం సాయంకాలం స్వామివారి అలంకరణ సేవలు ఉంటాయి. జయంతి 21వ తేదీన శ్రీ స్వామివారికి సహస్ర కలసాభిషేకాన్ని నిర్వహించడం జరుగుతుంది

## రోడ్డు ప్రమాదంలో బైకు దగ్ధం

**యాదాద్రి** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం, తూప్రాన్ పెట్ వద్ద రోడ్డుప్రమాదం జరిగింది. బైకును ఢీకొట్టిన లారీ కొద్ది దూరం వరకు ఈడ్చుకెల్లింది. దాంతో.. ప్రమాద దాటికి మంటలు చెలరేగి బైకు దగ్దమయ్యింది. బైక్ పై ప్రయాణిస్తున్న దంపతులకు తీవ్రగాయాలు కాగా.. వారికి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు...

## మెదక్ జిల్లాలో అకాల వర్షంతో అన్నదాతల ఇబ్బందులు

**మెదక్** జిల్లాలో కురిసిన అకాల వర్షాలు రైతులకు శోకాన్ని మిగిల్చాయి. వర్షానికి కల్లాల్లో ధాన్యం తడిచిపోయింది. పలు చోట్ల అర్ధరాత్రి నుంచి వర్షం కురిసింది. పెద్దశంకరంపేటలో అత్యధికంగా 8.5 సెం. మీ వర్షపాతం నమోదు అయింది. ధాన్యం ఆరబెట్టి వారం పది రోజులైనా ధాన్యం కొనడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గొనె సంచుల కొరత ఉందని మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడంలేదు. వాహనాల కొరతతో తూకం వేసిన ధాన్యాన్ని కల్లాల వద్దే విడిచిపెట్టిన వైనం ఇది.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**పరిగి** వికారాబాద్ జిల్లా పరిగి మండలం నస్కల్ గ్రామానికి చెందిన ముస్తఫా (32) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో తన సొంత పొలంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చెట్టుకు ఉరి వేసుకున్న మృతదేహాన్ని కిందకు దించి పంచనామా నిర్వహించి ముస్తఫా మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పరిగిలో బీఆర్ఎస్ నిరసన

**పరిగి** కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గారి పిలుపుమేరకు పరిధిలో రైతులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే కోప్పుల మహేష్ రెడ్డి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి క్వింటాళ్ల వడ్లపై 500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి.. ఇప్పుడు సన్న వడ్ల కు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించడం, మోసం చేయడం, దగా చేయడమేనని అన్నారు. “రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తది.?” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. “సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వంచించింద”న్నారు. “ఓట్లు డబ్బాలో పడంగనే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరింది. అందుకే నాలిక మల్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పూనుకున్నారు. ఇదే సన్న వడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు గనుక చెప్పింటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కు తుక్కు చేసేవాళ్లు. ఇప్పటికీ ప్రజలు ఆగ్రహంతోనే ఉన్నారు. రైతు బంధు ఇయ్యక, రైతు భరోసా ఇయ్యకుండా రైతాంగాన్ని అన్నిరకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నది. అందు కారణంగానే రైతాంగ హక్కులను హామీలను సాధించేందుకే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టిందని అన్నారు. ”

## బేగంపేట ఫ్లైఓవర్‌పై కారు ప్రమాదం

**సికింద్రాబాద్** పంజగుట్ట నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తుండగా ఫ్లై ఓవర్ పై డివైడర్ ను ఢీకొని రివర్స్ లో ట్రావెల్స్ బస్సును, ఫ్లై ఓవర్ గోడను కారు ఢీ కొట్టింది. కారులోని డ్రైవర్ తో సహా మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసులు వెంటనే డ్రైవర్ ను, మహిళను హాస్పిటల్ కు తరలించారు.

## స్వామివారి ఆశీర్వాదంతో తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది..

**- కాంగ్రెస్ హయంలో రైతులకు కష్టాలు**

**మేడ్చల్** తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు శామీర్ పేట్ మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో 46వేల చెరువులు సస్యశ్యామలంగా ఉండేవి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో తెలంగాణ రాష్ట్రం కరువు కరువుకాటకాలతో రైతులు అల్లాడిపోతున్నారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సరైన విద్యుత్తు, సాగునీరు లేక ప్రజలు, రైతులు పంటలు ఎండి పోయి ఆందోళన చెందుతున్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**



**జయశంకర్ భూపాలపల్లి :** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు.గురువారం స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగుల ఓ.పీ రిజిస్టర్, శానిటైజేషన్ ను క్రిటికల్, కాజ్ వాలిటి, ఆపరేషన్ థియేటర్ ను పరిశీలించారు.గతంలో ఆపరేషన్ థియేటర్ కు కావలసిన వైద్య పరికరాలకు నిధులు మంజూరు చేయగా ఆపరేషన్ థియేటర్ కు నూతనంగా కొనుగోలు చేసిన వైద్య పరికరాలను ఆపరేషన్ థియేటర్లోకి ఆఫ్రాన్ ధరించి వెళ్లి పరిశీలించారు. అనంతరం గతంలో ఆసుపత్రికి 5 ఎయిర్ కండిషనర్లు (ఎసిలు) మంజూరు చేశామని వాటి వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల వ్యాధులు బారిన పడిన ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి చికిత్స తీసుకోకుండా స్థానిక వంద పడకల ఆసుపత్రి లోనే ఆర్థో సేవలు అందుబాటులోకి తేవడం వల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. ఆసుపత్రి లోని వైద్యులు ఓ.పి కోసం వచ్చే రోగులు నిలబడవలసి వస్తుందని, రోగులకోసం 60 త్రీ సీటర్ చైర్స్ మంజూరు చేయాలని. విజ్ఞప్తి చేయగా తక్షణమే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, చికిత్సకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా, సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. వారికి మనోధై ర్యాన్ని కల్పించాలని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ కోడూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అటు అసెంబ్లీ.. ఇటు పార్లమెంట్

### ధర్మపురి అరవింద్

నిజామాబాద్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న ధర్మపురి అరవింద్ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల స్థానం నుంచి పోటీ చేశారు. అయితే ఆ స్థానంలో అరవింద్ ఓడిపోయారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ధర్మపురి అరవింద్ మళ్లీ నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేశారు. ధర్మపురి అరవింద్ కు ప్రత్యర్థిగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పోటీలో ఉన్నారు . అయితే ఈ ఎన్నికల్లో అటు జీవన్ రెడ్డి, ఇటు అరవింద్ తమ విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### జీవన్ రెడ్డి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జీవన్ రెడ్డి సుదీర్ఘమైన అనుభవం ఉన్న రాజకీయ నేత. జగిత్యాల అసెంబ్లీ స్థానంలో పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి ఓడిపోవడంతో ఎమ్మెల్సీగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో జీవన్ రెడ్డి విజయం సాధించారు, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల అసెంబ్లీ స్థానం నుంచి జీవన్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఆయన నిజామాబాద్ స్థానం నుంచి పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేశారు. అయితే ఈ స్థానంలో తాను విజయం సాధిస్తానని జీవన్ రెడ్డి చెబుతున్నారు. జీవన్ రెడ్డికి ప్రత్యర్థిగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ ఉన్నారు. వీరిద్దరి మధ్య పోటీ హోరాహోరీగా జరిగిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### కొప్పుల ఈశ్వర్

గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ మంత్రిగా కొప్పుల ఈశ్వర్ పని చేశారు . ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈ క్రమంలో పెద్దపల్లి పార్లమెంటు స్థానం నుంచి భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు సింగరేణి ఓట్లు అధికంగా ఉండే పెద్దపల్లి నియోజకవర్గంలో ఈసారి కచ్చితంగా తన గెలుస్తానని ఈశ్వర్ చెబుతున్నారు. మరోవైపు ఈశ్వర్ కు పోటీగా గడ్డం వంశీకృష్ణ ఉన్నారు. వంశీకృష్ణ గడ్డం వివేక్ కుమారుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు దివంగత వెంకటస్వామి అలియాస్ కాకా కు మనవడు. అయితే ఎన్నికల్లో తాను విజయం సాధిస్తానని వంశీకృష్ణ చెబుతున్నారు.

# కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో మరో ఊరట

చెప్పినట్లుగానే జూన్ 2న ఆయన కోర్టులో లొంగిపోవాల్సి ఉందని తెలిపింది. ఇందులో ఎలాంటి మార్పు లేదని వెల్లడించింది. ఈ విషయంలో తమపై వచ్చే విమర్శల్ని సైతం స్వాగతిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది.

# ఈసారి చరిత్ర సృష్టించబోతున్నాం

మరోసారి అధికారంలోకి వస్తున్నామని ధీమాగా చెప్పుకొచ్చారు. ప్రజలకు ఈ ఐదేళ్లకు మించిన గొప్ప పాలన అందిస్తామని వివరించారు.ఐ ప్యాక్ టీం చేసిన సేవలు వెలకట్టలేనిదిగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2019 లో గెలిచిన 151 సీట్ల కంటే అధికంగా వస్తున్నాయని జగన్ చెప్పుకొచ్చారు. 22 ఎంపీ సీట్లు వస్తున్నాయని లెక్క చెప్పారు. 2019 లో వైసీపీ 22 ఎంపీ స్థానాలు గెలిచింది. తిరిగి ఈ ఎన్నికల్లోనూ ఇదే సంఖ్య సాధిస్తామని జగన్ విశ్లేషించారు. ఎన్నికల తరువాత తొలిసారి స్పందించిన జగన్..తిరిగి సంచలన విజయం నమోదు చేయబోతున్నామని చెప్పారు. ప్రజలు సుపరిపాలనను చూసి మద్దతు ఇచ్చారని జగన్ వివరించారు. ఐ ప్యాక్ టీమ్ సేవలు వెలకట్టలేనివన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాలన అందించామని వ్యాఖ్యానించారు. ఐప్యాక్ సేవలను పరిపాలనలోనూ ఉపయోగించామన్నారు. ప్రశాంత్ కిషోర్ ఇప్పుడు మాటమార్చారని జగన్ పేర్కొన్నారు. ప్రశాంత్ కిషోర్ కలలోకూడా ఊహించని ఫలితాలు చూస్తామని జగన్ వివరించారు. ఫలితాలతో దేశంలోని ప్రతీ నేత ఏపీ వైపే చూస్తారని జగన్ ధీమాగా చెప్పుకొచ్చారు. ఇప్పుడు జగన్ గెలుపుపైన చేసిన కామెంట్స్ సీట్ల గురించి చెప్పిన లెక్కలతో ఏపీలో ఫలితాలపైన కొనసాగుతున్న ఉత్కంఠ వేళ సంచలనంగా మారింది.

# కీలక అధికారులపై ఈసీ కొరడా

జరిగిన హింసపై ఈసీ కఠిన చర్యలు తీసుకుంది. అధికారులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహిరంచినట్లుగా గుర్తించి సస్పెన్షన్లు, బదిలీలు చేసింది. ఏపీ సీఎస్, డీజీపీని పిలిపించుకుని వివరణ తీసుకున్న తర్వాత ఆదేశాలు జారీ చేసింది. పల్నాడు జిల్లా కలెక్టర్ ను ఉన్న పళంగా బదిలీ చేయాలని ఆదేశించింది. ఆయనపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. పల్నాడు, అనంతపురం జిల్లాల ఎస్పీల్ని తక్షణం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే వారిపై శాఖాపరమైన విచారణ కూడా చేయనున్నారు. తిరుపతి ఎస్పీని బదిలీ చేశారు. ఆయనపై కూడా శాఖాపరమైన విచారణ జరగనుంది. ప్రతి కేసులోనూ రెండు రోజుల్లో యాక్షన్ టేకెన్ రిపోర్టును సమర్పించాలని ఈసీ ఆదేశించింది. అలాగే కౌంటింగ్ అనంతరం ఎలాంటి పరిణామాలు సంభవించకుండా 25 సీఏపీఎఫ్ కంపెనీల దళాలు ఏపీలోనే ఉంచాలని ఈసీ స్పష్టం చేసింది.మూడు జిల్లాల్లో 12 మంది ఇతర పోలీసు అధికారుల సస్పెన్షన్ వేటు వేసింది. కౌంటింగ్ తర్వాత కూడా హింస చెలరేగే అవకాశం ఉండటంతో 25 కంపెనీల కేంద్ర పారామిలటరీ బలగాలను ఏపీలో 15 రోజుల పాటు కొనసాగించాలని స్పష్టం చేసింది. ఎన్నికల ఫలితాల అనంతరం జరిగే హింసను అదుపు చేయడానికి ఈ బలగాలను వినియోగించాలని ఆదేసించింది. హింస ప్రజ్వరిల్లవడం వెనుక పోలీసుల కుట్ర ఉందని తేలడంతో పన్నెండు మంది ఇతర అధికారులపై చర్యలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది

. ఉద్దేశపూర్వకంగా అల్లరి మూకలకు సమాచారం ఇవ్వడం వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించకపోవడం నిందితుల్ని అరెస్టు చేయకపోవడం వంటివి చేశారని ఈసీ గుర్తించినట్లుగా తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ అనంతరం చెలరేగిన హింస కలకలం రేపుతోంది. వరుసగా మూడు రోజుల పాటు ఇవి జరిగాయి. పదమూడో తేదీన పోలింగ్ జరుగుతున్న సమయంలో ప్రారంభమైన హింస నిరాటంకంగా సాగింది. మాచర్ల, నర్సరావుపేట, తిరుపతి వంటి చోట్ల జరిగిన హింసలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా బయటపడింది. కింది స్థాయి అధికారులే అధికార పార్టీ నేతలకు.. ప్రతిపక్ష నేతల కదలికలపై సమాచారం ఇచ్చారన్న ఆరోపణలు వచ్చాయి. ఇలా ఇచ్చిన వారి వివరాలను కూడా గుర్తించారని.. ఆ వివరాలను ఈసీకి ఇవ్వడంతోనే చర్యలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఏపీ డీజీపీ, ఏపీ సీఎస్ తీరుపైనా ఈసీ అసహనం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం ఉండటంతో ఆయనపై కూడా ఒకటి, రెండు రోజుల్లో వేటు పడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

# ఆపరేషన్ కరెంట్ షురూ

నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ కోసం ఈ కమిషన్ ఏర్పాటు చేయగా ఈమేరకు జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విచారణ కమిషన్ బహిరంగ ప్రకటన విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు, అవగాహన ఉన్న వివరాలు ఎవరికైనా తెలిస్తే 10 రోజుల్లో తమకు తెలియజేయాలని కమిషన్ కోరింది.2014లో బహిరంగ పోటీ బిడ్డింగ్ ప్రక్రియను అనుసరించకుండా నామినేషన్ ప్రాతిపదికన ఛత్తీస్‌గఢ్ డిస్కమ్స్ నుంచి విద్యుత్ సేకరణకు సంబంధించి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి ఏమైన సమాచారం ఉంటే తెలియజేయాలని కమిషన్ కోరింది. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కాకుండా సూపర్ సబ్ క్రిటికల్ టెక్నాలజీ వినియోగించడం రెండేళ్లలో పూర్తి కావాల్సిన నిర్మాణానికి 7 ఏళ్లు తీసుకోవడం వెనుక ఉన్న లోసుగులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని కోరింది. డిస్కంలపై భారం పడేలా బొగ్గు గనులకు దూరంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను దామరచర్లలో నిర్మించడానికి కారణాలు తెలిస్తే చెప్పాలంది. బహిరంగ పోటీ బిడ్డింగ్ ప్రక్రియను పాటించకుండా, నామినేషన్ ప్రాతిపదికన కాంట్రాక్టు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడంపై సాక్ష్యాలు ఉంటే తెలపాలని కమిషన్ పేర్కొంది.కరెంటు కొనుగోలులో అవకతవకలు, బిడ్డింగ్ ప్రక్రియకు సంబంధించిన ఆధారాల ఉంటే తమకు ఈ-మెయిల్ ద్వారా తెలుపాలని కమిషన్ కోరింది. ఒకవేళ ఈ-మెయిల్ ద్వారా పంపడం ఇబ్బంది అనుకుంటే బీఆర్కే భవన్‌కు పోస్టు ద్వారా కూడా ఆధారాలు పంపించవచ్చని సూచించింది. ఎలాంటి సమాచారమైనా పరిశీలించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కమిషన్ పేర్కొంది. టెక్నికల్ నాలెడ్జ్ ఉన్న వ్యక్తుల నుంచి సమాచార సేకరణ కోసం బహిరంగ విచారణ నిర్వహిస్తామని జస్టిస్ నర్సింహా రెడ్డి తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు సైతం బహిరంగ విచారణలో పాల్గొని తమ వద్ద ఉన్న సమాచారాన్ని అందిచొచ్చన్నారు. వ్యక్తిగత దూషణలకు, రాజకీయ విమర్శలకు తావులేకుండా విచారణ నిర్వహిస్తామని ఇందుకు అందరూ సహకరించాలని జస్టిస్ నర్సింహా రెడ్డి కోరారు.

# రాబోయే రోజుల్లో మారిన చంద్రబాబును చూస్తారు

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఎన్ఆర్ఐలు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి రావడం మంచి పరిణామం అన్నారు చంద్రబాబు. కొంతమంది ప్రవాసాంధ్రులు పోలింగ్‌కు నెల ముందే ఎన్డీఏ గెలుపు కోసం పనిచేశారని, ప్రచారంలో పాల్గొన్నారని వారందరి సేవలు మరవలేనివని ప్రశంసించారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకొన్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని వ్యాఖ్యానించారు. ఏపీలో కూడా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం కోసం దేశవిదేశాల్లోని ఎన్ఆర్ఐలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక పాలసీ తీసుకొచ్చి ఎన్ఆర్ఐల సమస్యల కోసం పనిచేస్తామన్నారు.గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఐల సంక్షేమంపై దృష్టిపెట్టకపోవడంతో వారి ద్వారా రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలు రాకుండా ఆగిపోయాయన్నారు టీడీపీ అధినేత. గల్ఫ్ దేశాల్లోని ఎన్ఆర్ఐలు ప్రమాదం బారినపడితే రూ.లక్ష, ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.10 లక్షలు, అక్కడ వారికి ఏదైనా న్యాయ సమస్యలు తలెత్తితే రూ.50 వేల వరకు అందేలా గత టీడీపీ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీ ఎన్ఆర్టీ విభాగం కింద టీడీపీ హయాంలో ఇమ్మిగ్రేషన్, ఇతర సమస్యలతో ఇబ్బంది పడేవారిని స్వదేశాలకు తరలించడంతోపాటు దుబాయ్ తదితర గల్ఫ్ దేశాల్లో ఉద్యోగ, ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించడం కోసం తమ ప్రభుత్వం రెండు శిక్షణ కేంద్రాలు నిర్వహించిందన్నారు. రాష్ట్రం నుంచి ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వారికి మంచి వేతనం లభించేలా, వారికి శిక్షణ అందించేలా సదరు కేంద్రాలను నడిపామన్నారు చంద్రబాబు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఐల కోసం చేపట్టిన కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్ఆర్ఐల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. ఏపీ భవిష్యత్తు కోసమే తాము కుటుంబ సభ్యులతో సహా స్వచ్ఛందంగా ఏపీకి తరలివచ్చి ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నామని, స్వయంగా ఓటు వేయడం సంతోషంగా ఉందని పలువురు ఎన్ఆర్ఐలు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, కూటమి గెలుపు ఏపీకి మలుపు కాబోతుందన్నారు. మంగళగిరి వివర్స్ సోసైటీ బలోపేతం చేసేందుకు వారి అమ్మకాలను ప్రోత్సహించేలా టీడీపీ కేంద్ర కార్యాలయంలో పనిచేసే హౌస్ కీపింగ్, ఆఫీస్ బాయ్స్, సెక్యూరిటీ సిబ్బందికి రూ. 2 వేలు విలువ చేసే గిఫ్ట్ చెక్స్ ను ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు అందజేశారు.

# ప్రభుత్వ ఆదాయ పెంపు మార్గాలపై రివ్యూ

సమావేశమయ్యారు. గత ఏడాది వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి నెలా ఆదాయ పెంపును సమీక్షించుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. బడ్జెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకానెలా మంత్లీ టార్గెట్ ను నిర్దేశించుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రధానంగా రాష్ట్రానికి రాబడి తెచ్చిపెట్టే జీఎస్టీ ఎగవేత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జీఎస్టీ కలెక్షన్ పెంచేందుకు పక్కాగా ఫీల్డ్ ఇన్స్పెక్షన్, ఆడిటింగ్ జరగాలని సూచించారు. జీఎస్టీ ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. వాణిజ్య శాఖలో ఇంతకాలం జరిగిన పొరపాట్లు పునరావృతం కావద్దని, జీఎస్టీ రిటర్న్ పేరిట వెలుగులోకి వస్తున్న అవినీతి అక్రమాలకు తావు లేకుండా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల సీజన్లో మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినా లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమంగా మద్యం రవాణా, పన్ను ఎగవేత లేకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్తో పాటు రాష్ట్రంలో అన్ని చోట్ల భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయి. కానీ అదే స్థాయిలో రెవిన్యూ రాబడుల్లో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరగలేదని ఈ సందర్భంగా చర్చ జరిగింది. చాలా చోట్ల భూముల మార్కెట్ విలువకు, వాస్తవ క్రయ విక్రయాల రేట్లకు పొంతన లేకపోవటం ప్రధాన కారణమనే చర్చ జరిగింది. గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచింది. ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉంది. నిబంధనల ప్రకారం ఏడాదికోసారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉంటుంది. ఈ ధరల సవరణకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.ఎక్కడెక్కడ, ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలి, వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్మెంట్లు వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారణ జరగాలని, రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగం నిబంధనలను పక్కాగా పాటించాలని సీఎం చెప్పారు. రాష్ట్ర రాబడి పెంపుతో పాటు స్థిరాస్థి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా భూముల మార్కెట్ ధరల సవరణ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే స్టాంప్ డ్యూటీ ఎంత మేరకు ఉంది దానిని తగ్గించాలా, పెంచాలా అనేది కూడా అధ్యయనం చేయాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే చాలాచోట్ల అద్దె భవనాల్లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్లకు వచ్చే వాళ్లు ఇప్పటికే చెట్ల కింద నిలబడే ఉంటున్నారని చర్చకు వచ్చింది. పబ్లిక్ యుటిలిటీకి సేకరించిన స్థలాలను గుర్తించి కొన్నిచోట్ల అధునాతనంగా మోడల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మించాలని, అందుకు సన్నాహాలు చేయాలని సీఎం చెప్పారు. సామాన్యులకు, చిన్న చిన్న నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇసుక ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను ఎక్కడికక్కడ అరికట్టాలని ఆదేశించారు.

# అలాంటప్పుడు కోర్టు అనుమతి తప్పనిసరి

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మనీల్యాండరింగ్ నిరోధక చట్టం సెక్షన్ 19 ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల అరెస్ట్ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారాలపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రత్యేక న్యాయస్థానం జారీచేసిన సమన్లకు స్పందించి నిందితుడు హాజరైతే అరెస్టు చేసే అధికారం ఈడీకీ లేదని పేర్కొంది. ఇటువంటి సందర్భంలో ముందుగా కోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నేరాన్ని గుర్తించిన తర్వాత నిందితుడిగా చూపిన వ్యక్తిని పీఎంఎల్ చట్టం సెక్షన్ 19 కింద అరెస్టు చేసే అధికారం ఈడీకీ లేదని ఉద్ఘాటించింది. పీఎంఎల్ఏలోని సెక్షన్ 19 ఒక వ్యక్తి నేరం చేసినట్టు లిఖితపూర్వక ఆధారాలుంటే అరెస్టు చేయడానికి ఈడీకి అనుమతిస్తుంది. ముఖ్యంగా నిందితుడిగా ఉన్న వ్యక్తికి తన అరెస్టుకు గల కారణాలను దర్యాప్తు సంస్థ ముందుగానే తెలియజేయాల్సి ఉంటుంది. ప్రత్యేకించి ఈడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు నిందితులను అరెస్టు చేయని కేసుల్లో.. వారిని అరెస్టు చేయలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ప్రత్యేక న్యాయస్థానం ముందుగా సమన్లు జారీ చేయాలి.. ఆ సమన్లకు నిందితులు సరైన సమాధానమిస్తే వారు 'కస్టడీలో' ఉన్నట్లు చూడలేం' అని పేర్కొంది.'సమన్లకు హాజరై సమాధానం ఇచ్చిన తర్వాత నిందితుడ్ని కస్టడీలోకి తీసుకోవాలని భావిస్తే అందుకోసం ప్రత్యేక కోర్టుకు దరఖాస్తు చేయాలి.. కస్టోడియల్ విచారణ అవసరమని కోర్టు విశ్వసిస్తే కస్టడీకి అనుమతిస్తుంది' అని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భయన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. సీపీసీ సెక్షన్ 70 ప్రకారం నిందితుడు సమన్లకు సమాధానం ఇవ్వడంలో విఫలమైనప్పుడు మాత్రమే అరెస్ట్ వారెంట్ జారీచేయాల్సి ఉంటుందని ధర్మాసనం నొక్కిచెప్పింది. తాజా తీర్పుతో ఈడీ ఏకపక్ష అరెస్టుల నుంచి రక్షణ కలిగించినట్టయ్యింది. కోర్టు సమన్లకు సమాధానం ఇవ్వడానికి ముందు నిందితులను అరెస్టు చేయలేరని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ అంశంపై ఏప్రిల్ 30న విచారణ పూర్తిచేసిన సర్వోన్నత న్యాయస్థానం తీర్పును రిజ్వర్ చేసింది. తాజాగా తీర్పును వెలువరించింది.

# జీవన్ రెడ్డి మాల్ సీజ్

రద్దు చేసింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బస్‌స్టేషన్ సమీపంలోని ఆర్టీసీ స్థలంలో ఉన్న జీవన్ రెడ్డి మాల్ అండ్ మల్టీప్లెక్స్ భవనాన్ని గురువారం సాయంత్రం సంస్థ స్వాధీనం చేసుకుంది. ఆర్టీసీకి చెందిన 7059 చదరపు గజాల భూమిని 33 సంవత్సరాలకు విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీ బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(బీవోటీ) కింద 01.06.2013న లీజ్‌కు తీసుకుంది. 2017లో విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సతీమణి రజితా రెడ్డి టేక్‌ఓవర్ చేసుకుని షాపింగ్ మాల్‌కు జీవన్ రెడ్డి మాల్ అండ్ మల్టీపెక్స్‌గా పేరుపెట్టారు. థర్డ్ పార్టీలకు అందులోని స్టాళ్లను లీజ్‌కు ఇచ్చారు.

ఒప్పందం ప్రకారం ఆ కంపెనీ సకాలంలో అద్దె చెల్లించలేదు. గత ఏడాది అక్టోబర్ వరకు రూ.8.65 కోట్ల బకాయి సంస్థకు పడింది. నోటీసులు జారీ చేయడంతో అక్టోబర్ లో రూ.1.50 కోట్లను ఆ కంపెనీ చెల్లించింది. ఆ తర్వాత షోకాజ్ నోటీసులు పంపించడంతో గత ఏడాది డిసెంబర్ లో విడతల వారీగా రూ.2.40 కోట్లను కట్టింది. షోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ హైకోర్టును వారు ఆశ్రయించారు. టీఎస్ఆర్టీసీకి బకాయిలు చెల్లించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో విడతల వారీగా రెండు కోట్లను చెల్లించారు. అయితే ఈ కేసుపై బకాయిలన్నీ నెల రోజుల్లో చెల్లించాలని మార్చి 27న హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అది ప్రజల డబ్బు అని స్పష్టం చేసింది. బకాయిలు చెల్లించకుంటే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సంస్థను ఆదేశించింది. నెల రోజుల గడువు పూర్తయిన మొత్తం బకాయిను ఆ కంపెనీ చెల్లించలేదు. ఇప్పటివరకు రూ.2.51 కోట్ల అద్దె బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

# భాగ్యనగరంలో భారీ వర్షం

మేఘాలు కమ్ముకుని ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టుగా భారీ ఎత్తున వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు భారీ స్థాయిలో ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో నగరం మొత్తం తడిసిముద్దయింది. రోడ్లన్ని వర్షపు నీటితో నిండిపోయాయి. పలు చోట్లలో రోడ్లపై పెద్దఎత్తున వర్షపు నీరు నిలవటంతో భారీగా ట్రాఫిక్ జామైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జూబ్లిహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, కూకట్ పల్లి, నిజాంపేట, జీడిమెట్ల, సికింద్రాబాద్ ప్రాంతాల్లోనూ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. జగద్గిగిరిగుట్ట, బాలానగర్, మేడ్చల్, కీసర ఏరియాల్లోనూ భారీ వర్షం పడుతుంది. కుత్బుల్లార్, మల్కాజిగిరి, ఆల్వాల్ ప్రాంతాల్లోనూ వర్షం పడుతుంది. పలు ప్రధాన కూడళ్లలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది.భారీ వర్షం కురిసే అవకాశం ఉండటంతో నగరవాసులు జాగ్రత్తగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఇప్పటికే వర్షం తీవ్రతతో రోడ్లపై వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయని అవసరమైతే తప్ప బయటి రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. అంతేకాకుండా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.రాత్రి సమయంలోనూ భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయని అత్యవసరం అయితేనే బయటకు రావాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం కావటంతో రోడ్లపై తీవ్రస్థాయిలో ట్రాఫిక్ జాం అయ్యే అవకాశం ఉందని చెప్తున్నారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. నీళ్లు నిలిచే ప్రాంతాల్లో వాహనాలు నిదానంగా వెళ్లాలని సూచించారు.కుత్బుల్లాపూర్, చింతల్, షాపూర్ నగర్, గాజులరామారాం, సూరారం, బాచుపల్లి, నిజాంపేట తదితర ప్రాంతాల్లో ఈదుర గాలులు, ఉరుములతో కూడిన వర్షం కురుస్తోంది. సికింద్రాబాద్‌లో గాంధీ ఆసుపత్రి, రైల్వే స్టేషన్, మెట్టుగూడ, సీతాఫల్ మండి, చిలకలగూడా ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. బషీర్ బాగ్, కోటి అబిడ్స్, బేగం బజార్ ప్రాంతాల్లోనూ గట్టిగానే వర్షం కురిసింది. సోమాజిగూడ, పంజాగుట్ట, బంజారాహిల్స్ జూబలీహిల్స్ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. మేడ్చల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురుస్తోంది. నాంపల్లి, అబిడ్స్, గోశామహల్, అఫ్జల్ గంజ్‌లో కూడా భారీగా వర్షం కురిసింది.

# నేతల్లో క్రాస్ ఓటింగ్ భయం

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు ముగిశాయి. నేతల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. అయితే ఫలితాలు రావడానికి ఇంకా సమయం ఉంది. అయితే కొన్ని నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ జరిగిందన్న ఫీడ్ బ్యాక్ తో నేతల కంటి మీద కునుకు లేకుండా పోయింది. అసెంబ్లీకి ఒక గుర్తుపైన ఓటు వేసిన వారు పార్లమెంటుకు వచ్చేసరికి మరో గుర్తుపై వేశారంటున్నారు. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన ఏజెంట్లు, ముఖ్య కార్యకర్తల నుంచి వచ్చిన సమాచారంతో క్రాస్ ఓటింగ్ పెద్దయెత్తున జరిగిందని చెబుతున్నారు. ముఖ్యంగా తూర్పు గోదావరి జిల్లాలోని పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పెద్దయెత్తున క్రాస్ ఓటింగ్ జరిగినట్లు ప్రచారం జరుగుతుంది. తూర్పు గోదావరి జిల్లాలో కూటమి తరుపున మూడు పార్టీల అభ్యర్థులు బరిలోకి దిగారు. మూడు గుర్తులు ఓటర్లకు చెప్పడానికి నేతలు కొంత కష్టపడాల్సి వచ్చింది. ఇంటింటి ప్రచారంలోనూ ఎవరికి వారే తమ గుర్తును ప్రచారం చేసుకుని వెళ్లారు. మూడు గుర్తులు చెబితే ఓటర్లు కన్ఫ్యూజన్ కు గురవుతారని భావించి మూడు పార్టీలూ కూడా ఒక గుర్తు ను మాత్రమే ప్రచారం చేసి వెళ్లారు. అయితే కొన్ని చోట్ల రెండు గుర్తులకు ఓటు వేయాల్సి వచ్చింది. ఇది ఇబ్బందిగా మారింది. కాకినాడ పార్లమెంటుకు జనసేన అభ్యర్థి పోటీ చేయగా, రాజమండ్రి పార్లమెంటు నుంచి బీజేపీ అభ్యర్థి పోటీ చేశారు. అంటే ఈ పార్లమెంటు పరిధిలోని శాసనసభ నియోజవర్గాలు రెండు గుర్తులను గుర్తుపెట్టుకుని మరీ ఓటువేయాల్సిన పరిస్థితి ఉంది. అందుకే ఎన్నికల తర్వాత నేతలు జరుపుతున్న విశ్లేషణలలో ఇవన్నీ బయటపడుతున్నాయి. ఓటర్లు తాము ఆ గుర్తుకు వేయలేదని చెబుతుండటంతో క్రాస్ ఓటింగ్ జరిగిందని భావిస్తున్నారు. కాకినాడ పార్లమెంటు పరిధిలో వైసీపీ నుంచి పోటీ చేసిన చలమలశెట్టి సునీల్ మూడు సార్లు వివిధ పార్టీల నుంచి ఓటమి పాలయి కొంత సానుభూతిని కూడగట్టుకున్నారంటున్నారు. ఆయన అనేక మందికి ఉపాధి కూడా తన సంస్థల్లో కల్పించడంతో పాటు ప్రత్యర్థి కొత్తవాడు కావడంతో జనం అటు వైపు మొగ్గు చూపారంటున్నారు. అందుకే కాకినాడ పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజవర్గం పరిధిలో ఎక్కువ క్రాస్ ఓటింగ్ జరిగిందన్న లెక్కలు బయటకు వస్తున్నాయి. దీంతో వైసీపీ అభ్యర్థి ఇక్కడ గెలిచినట్లేనని పెద్దయెత్తున బెట్టింగ్ లు కూటమిలోని ఒక పార్టీకి చెందిన నేతలే కడుతుండటంతో అనుమానం మరింత బలపడుతుంది. అలాగే బీజేపీ అధ్యక్షురాలు పురంద్రీశ్వరి పోటీ చేసిన రాజమండ్రి స్థానంలో కొన్ని వైసీపీ ఓటు బ్యాంకు నుంచి కూడా ఆమెకు పడినట్లు చర్చ జరుగుతుంది. ఎన్టీఆర్ కుమార్తెగానే కాకుండా మహిళ కావడంతో ఎక్కువ మంది మహిళలు అసెంబ్లీకి వైసీపీకి ఓటు వేసిన వారు కూడా పార్లమెంటుకు వచ్చేసరికి బీజేపీకి వేశారంటున్నారు. అయితే వైసీపీ నుంచి పోటీ చేసిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కూడా మంచి వ్యక్తి. అందరికీ సుపరిచితుడు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆయనకు మంచి పేరుంది. అందుకే డాక్టర్ కు కాదని బీజేపీకి ఓటు వేయకుండా అనేక మంది టీడీపీ సానుభూతి పరులు కూడా బటన్ నొక్కరంటున్నారు. అందుకే రాజమండ్రి పార్లమెంటు ఫలితం మాత్రం చివర వరకూ ఉత్కంఠగానే సాగుతుందంటున్నారు. ఈ రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ భయం మాత్రం పట్టుకుంది. మరి ఇది నిజమా? అబద్ధమా? ప్రచారమా? అన్నది జూన్ 4వ తేదీన తేలనుంది.

# కడపలో క్రాస్ ఓటింగ్

**కడప :** ఏపీలో అత్యంత ఉత్కంఠం రేపిన నియోజకవర్గం కడప పార్లమెంట్ స్థానం. ఇక్కడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పిసిసి అధ్యక్షురాలు షర్మిల పోటీ చేశారు. వివేక హత్య కేసును హైలైట్ చేస్తూ.. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న అవినాష్ రెడ్డి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తుండడంతో.. షర్మిల నేరుగా రంగంలోకి దిగారు. అవినాష్ ను ఎలాగైనా ఓడించాలన్న కసితో పని చేశారు. అయితే జగన్ దెబ్బతీయాలని అటు చంద్రబాబు భావిస్తున్న తరుణంలో.. షర్మిల అన్న పై యుద్ధం ప్రకటించడంతో విపక్షాల నుంచి ఆమెకు ఆయాచిత లబ్ధి చేకూరినట్లు తెలుస్తోంది.ఒకవైపు షర్మిల రాజకీయ పోరాటం చేస్తుంటే.. మరోవైపు సునీత న్యాయ పోరాటం చేస్తూ ముందుకు సాగారు. షర్మిలకు అండగా సునీతతో పాటు ఆమె తల్లి సౌభాగ్యమ్మ ప్రచారం చేశారు. జగన్ తల్లి విజయమ్మ షర్మిల కు మద్దతుగా ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. షర్మిల కు మద్దతు తెలపాలని కడప జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలో షర్మిల కడప జిల్లాలో చేసిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైయస్ బిడ్డగా అడుగుతున్నా న్యాయం చేయండి.. కొంగు చాచి అడుగుతున్నా న్యాయం చేయండి అంటూ షర్మిల అడిగేసరికి కడప జిల్లా ప్రజల్లో ఒక రకమైన చేంజ్ కనిపించింది. ముఖ్యంగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. అటు జగన్ పై అభిమానం ఉన్నవారు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేస్తే.. ఎంపీ విషయానికి వచ్చేసరికి షర్మిలకు ఓటు వేసినట్లు తెలుస్తోంది. పోలింగ్ సరళి కూడా దానినే తెలియజేస్తోంది.ఇక్కడ టిడిపి అభ్యర్థిగా భూపేష్ రెడ్డి ఉన్నారు. ఇక్కడ టిడిపికి నిర్దిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. కానీ జగన్ ను దెబ్బతీయాలంటే షర్మిలకు సపోర్ట్ చేయడమే మేలన్న నిర్ణయానికి టిడిపి వచ్చినట్లు సమాచారం. ఎంపీ కి మాత్రం షర్మిలకు వేసి, ఎమ్మెల్యేల విషయానికి వచ్చేసరికి మాత్రం కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని టిడిపి నాయకత్వం అంతర్గతంగా క్యాడర్కు మార్గదర్శకం చేసినట్లు సమాచారం.

# ఫైర్ బ్రాండ్ల ఫ్యూచర్ ఏంటీ

**విజయవాడ :** వైసీపీ ఫైర్ బ్రాండ్ల పరిస్థితి ఏమిటి? ఎన్నికల్లో గెలుపు పొందుతారా? ఓటమి చవిచూస్తారా? ఒకవేళ ఓడిపోతే వారి పరిస్థితి ఏంటి? ఇప్పుడు ఏపీలో ఇదో ఆసక్తికర రాజకీయ పరిణామంగా మారింది. ఎక్కడ చూసినా వారిపైనే చర్చ జరుగుతోంది. ఎక్కువమంది ఆరా తీయడం కనిపిస్తోంది. మంత్రులు ఆర్కే రోజా, అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్, మాజీ మంత్రులు కొడాలి నాని, అనిల్ కుమార్ యాదవ్ లు వైసీపీలో ఫైర్ బ్రాండ్లుగా ముద్రపడ్డారు. అధినేత పై ఈగ వాలనిచ్చేవారు కాదు. రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత కామెంట్లకు దిగేవారు. గత ఐదేళ్లుగా అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచేవారు. అందుకే వారి పరిస్థితి ఎలా ఉందో అని ఎక్కువమంది ఆరా తీస్తున్నారు.మంత్రి రోజా నగిరి నుంచి హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తున్నారు. కానీ వాస్తవం ప్రతికూలంగా ఉంది ఆమెకు. పోలింగ్ నాడే ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. తెలుగుదేశం పార్టీతో తనకు ఇబ్బంది లేకుండా.. సొంత పార్టీ వారే తనను ఓడించడానికి సిద్ధపడ్డారని చెప్పడం ద్వారా.. ముందుగానే ఓటమిని అంగీకరించారు ఆమె. అక్కడ రోజాకు టికెట్ ఇవ్వద్దని వైసీపీకి చెందిన నేతలే హై కమాండ్ కు కోరారు. కానీ జగన్ అవేవీ పట్టించుకోలేదు. రోజా కి టికెట్ ఇచ్చారు. కానీ అసమ్మతి నాయకులను రోజా కలుపుకొని వెళ్లలేదు. ప్రచారానికి కూడా పిలవలేదు. తీరా ఇప్పుడు పోలింగ్ ముగిశాక వారు సహకరించలేదని చెప్పడం ద్వారా రోజా ఓటమిని అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది.కొడాలి నాని 2004 నుంచి గుడివాడలో గెలుపొందుతూ వస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపొంది రికార్డ్ సృష్టించాలని భావిస్తున్నారు. కానీ ఈసారి అంత ఈజీ కాదని తెలుస్తోంది. ఇక్కడ తెలుగుదేశం పార్టీ పట్టు బిగించింది. బలమైన అభ్యర్థిని బరిలో దించింది. ప్రభుత్వంపై వ్యతిరేకత మరోవైపు, కొడాలి నాని ఓడించాలని టిడిపి కలిసి ఇంకోవైపు గట్టిగానే ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. అత్తెసరు మెజారిటీతో మాత్రమే నాని గెలిచే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఒకవేళ ప్రభుత్వంపై వ్యతిరేకత తీవ్రంగా ప్రభావం చూపితే ఓటమి కూడా ఎదురయ్యే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.మంత్రి అంబటి రాంబాబు పరిస్థితి కూడా ఏమంత ఆశాజనకంగా లేదు. ఆయన సత్తెనపల్లి నుంచి రెండోసారి పోటీ చేస్తున్నారు. కానీ ఈసీ అంతగా పని చేయడం లేదని.. టిడిపికి అనుకూలంగా పనిచేసినట్లు మీడియా ముందుకు వచ్చి ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అక్కడ ఓటమి తప్పదని సంకేతాలు ఉన్నాయి. పోలింగ్ సరళి కూడా మారడంతో అంబటిలో ఆందోళన ప్రారంభమైంది. అందుకే ఓటమికి కుంటి సాకులు వెతుక్కుంటున్నారని టిడిపి చెబుతోంది.గుడివాడ అమర్నాథ్ పరిస్థితి కూడా అలానే ఉంది.

## గాయంతోనే కేన్స్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యారాయ్




అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఫ్రాన్స్‌లో జరిగే కేన్స్‌కు ప్రత్యేకత ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎందరో సినీ తారలు ఈ కార్యక్రమంలో పాల్గొని రెడ్ కార్పెట్‌పై సందడి చేస్తుంటారు. ఈ కేన్స్ వేడుకల్లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్, మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యరాయ్ బచ్చన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటారు. విభిన్న కాస్ట్యూమ్స్‌తో అలరిస్తుంటుంది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు కొత్త కళ తెస్తుంటుంది ఐశ్వర్య. ఆమె రెడ్ కార్పెట్‌పై అలా నడుచుకూంటూ వస్తుంటే కెమెరా కళ్లన్నీ ఐష్ వైపే ఉంటాయి. అయితే, ఈ సారి ఆమె గాయంతోనే కేన్స్‌లో పాల్గొనబోతోంది. గాయం కారణంగా చేతికి కట్టుతోనే కుమార్తెతో కలిసి ఐశ్వర్య ఫ్రాన్స్‌కు పయనమైంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఫ్రాన్స్ వేదికగా ఏటా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతుందన్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన సినీ తారలు, మోడళ్లు, డిజైనర్లు, పలువురు సెలబ్రిటీలు ఈ వేడుకలో పాల్గొని విభిన్న ఫ్యాషన్ దుస్తుల్లో రెడ్ కార్పెట్ పై హొళయలుపోతుంటారు. బాలీవుడ్ నుంచి కూడా పలువురు తారలు హాజరై ట్రెండీ దుస్తులు ధరించి అందరినీ ఆకర్షిస్తుంటారు. ఇక ఏటా ఐశ్వర్య ఈ వేడుకలకు కచ్చితంగా హాజరవుతుంటుంది. కొత్త కొత్త కాస్ట్యూమ్స్ ధరించి తళుక్కున మెరిసి ఆకట్టుకుంటుంటుంది. అయితే, ఈ సారి ఆమె గాయంతోనే కేన్స్ వేడుకల్లో సందడి చేసేందుకు సిద్ధమైంది.

## జీవితంలో కొన్ని త్యాగాలు తప్పవు: జాన్వీ



'జీవితంతో కొన్ని సాధించాలంటే కొన్ని త్యాగాలు చేయాలి, సవాళ్లను ఎదుర్కొవాలి, అలాగే అభిమానులు, ప్రేక్షకులను మెప్పించాలంటే కథానాయికగా బలమైన కథలు ఎంచుకోవాలి. వాటితో ప్రేక్షకులను మెప్పించాలి. అందుకోసం చాలా కష్టపడాలి' అంటున్నారు బాలీవుడ్ యువకథానాయిక జాన్వీకపూర్. 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రం కోసం ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని ఆమె చెప్పారు. రాజ్‌కుమార్ రావ్‌తో కలిసి ఆమె నటించిన చిత్రమిది. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కింది. ఈ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో షూటింగ్ టైమ్‌లో ఎదుర్కొన్న సవాళ్లను గురించి చెప్పుకొచ్చింది. ఈ సినిమా కోసం రేయింబవళ్లు కష్టపడి క్రికెట్ నేర్చుకున్నాను. దర్శకుడు శరణ్ శర్మ ఏ పనిలోనైనా నాణ్యతని కోరుకుంటారు. క్రికెట్ నేపథ్యంలో కథ కాబట్టి నేను తప్పక క్రికెట్ నేర్చుకోవాలని పట్టుబట్టారు. ఎలాంటి వీఎఫ్ఎక్స్ ఉపయోగించకూడదన్నారు. శిక్షణ సమయంలో ఎన్నో దెబ్బలు తగిలాయి. భుజాలు డిస్‌లొకేట్ అయ్యాయి. ఈ చిత్రాన్ని వదిలేద్దామని అనుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ నేను క్రికెట్ ఆడగలనని నాలో ధైర్యం నింపింది శిక్షకులు అభిషేక్ నాయర్, నాయర్, విక్రాంత్ సర్ మాత్రమే' అని అంది. సినిమా ప్రమోషన్ లో ఆరు నంబరు కలిగిన దుస్తుల్ని మాత్రమే ఎందుకు ధరిస్తున్నారు అన్న ప్రశ్నకు.. 'ఈ సినిమాలో నేను పోషించిన మహిమ పాత్ర క్రికెట్ ఆటలో ఆరు నంబరు గల జెర్సీనే ధరిస్తుంది. ఆమె ధోనీకి వీరాభిమాని. మేము కూడా షూటింగ్ సమయంలో ధోని ధరించే ఏడు నంబరు జెర్సీనే ఉపయోగించాలనుకున్నాం. కానీ ఆ నంబరు ఆయనకు మాత్రమే సొంతం అనుకొని ఆరుని నిర్ణయించాం. అంతేకాదు ఆరు నా లక్కీ నంబరు కూడా. ఈ సినిమాకు కూడా ఆ అదృష్టం కలిసిరావాలని ఆశిస్తున్నా' అని చెప్పారు. జాన్వీ. ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ప్రస్తుతం జాన్వీ రెండు తెలుగు చిత్రాల్లో కూడా నటిస్తోంది. ఎన్టీఆర్ సరసన 'దేవర', రామ్‌చరణ్, బుచ్చిబాబు సాన కాంబోలో వస్తున్న చిత్రంలోనూ నటిస్తోంది.


## నిందతో వస్తున్న వరుణ్ సందేశ్






కాంద్రకోట మిస్టరీ అంటూ యథార్థ సంఘటనల నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రం 'నింద'లో వరుణ్ సందేశ్ హీరోగా నటించారు. ఈ మూవీని రాజేష్ జగన్నాథం నిర్మించడమే కాకుండా కథ, కథనాన్ని రాసి దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్, ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందనను రాబట్టుకోగా.. తాజాగా ఈ మూవీ టీజర్‌ను విలక్షణ నటుడు నవీన్ చంద్ర చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. ఇటీవల జరిగిన దాదా సాహెబ్ ఫాల్కే ఫెస్టివల్ అవార్డ్స్‌లో అవార్డును అందుకున్న నవీన్ చంద్ర టీజర్ విడుదల చేసిన అనంతరం చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. టీజర్ బాగుందని టీంను మెచ్చుకున్నారు. సినిమా మంచి విజయం సాధించి టీమ్ అందరికీ మంచి పేరు తీసుకురావాలని కోరారు. టీజర్ విషయానికి వస్తే.. 'జీవితంలో కొన్ని సార్లు తప్పని తెలిసినా చేయక తప్పదు'.. అనే డైలాగ్‌తో మొదలైన ఈ టీజర్‌లో ఎన్నో కోణాలున్నాయి. అందమైన ప్రేమ కథ కనిపిస్తోంది. దాంతో పాటుగా మర్డర్, క్రైమ్ మిస్టరీ కూడా ఉన్నట్టుగా తెలుస్తోంది. అలాగే టీజర్‌లోని విజువల్స్ కూడా ఎంతో న్యాచురల్‌గా ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఆర్ఆర్ అయితే మూడ్‌కు తగ్గట్టుగా సాగింది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను ఫీల్ అయ్యేలా నేపథ్య సంగీతం సాగింది. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని.. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామని దర్శకనిర్మాత తెలిపారు.

## 'భారతీయుడు 2' ట్రైలర్ రిలీజ్ కోసం ప్లాన్



కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'భారతీయుడు 2' వీళ్లిద్దరి కాంబినేషన్‌లోనే వచ్చిన హిట్ సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా ఇది రానుంది. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని అప్‌డేట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మూడో భాగంపై కూడా వార్తలు వస్తుండడంతో సినీ ప్రియులు సంబర పడుతున్నారు. 'భారతీయుడు 2'తో పాటే మూడో భాగాన్ని కూడా సిద్ధం చేస్తున్నట్లు టీమ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. పార్ట్ 3కు సంబంధించిన షూటింగ్‌ను కూడా శంకర్ కంప్లీట్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ రెండు సినిమాలను ఏడాదిలోపే విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. 'భారతీయుడు 2' ట్రైలర్ రిలీజ్ కోసం యూనిట్ ఓ భారీ ఈవెంట్‌ను ప్లాన్ చేస్తోందట. ఇప్పటికే పనులు పూర్తయినట్లు టాక్. జూన్‌లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు చిత్రబృందం గతంలోనే తెలిపింది. జూన్‌కు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కష్టమని అందుకే దీన్ని జులై 12కు వాయిదా వేసినట్లు టాక్ వినిపిస్తుంది. అన్నిటికంటే ముఖ్యంగా ఈ మూవీ టీమ్ భారీ సర్‌ప్రైజ్‌కు ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది. పార్ట్2 ÷-లకైమాక్స్‌లోనే మూడో భాగం ట్రైలర్‌ను ప్రదర్శించాలని చూస్తోందట. దానితో పాటే పార్ట్-3 విడుదల తేదీని కూడా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చి సంచలనం సృష్టించింది 'భారతీయుడు'. సేనాపతి పాత్రలో కమల్ ఆహార్యం, హావభావాలు ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' మరోసారి మ్యాజిక్ చేసేందుకు సిద్ధమైంది. ఇది విడుదలైన వెంటనే మూడో భాగానికి సంబంధించిన నిర్మాణాంతర పనుల్ని మొదలు పెట్టనున్నారు.

## నా బ్యాంక్ ఖాతా హ్యాక్ కాలేదన్న రేణూ



తన బ్యాంకు ఖాతా ఏమీ హ్యాక్ అవలేదని, తానే డొనేషన్ కోసం వివరాలు షేర్ చేశానని, సినీ నటి రేణు దేశాయ్ అన్నారు. జంతు సంరక్షణ కోసం రూ.3500 విరాళంగా ఇవ్వాలంటూ ఇన్‌స్టా వేదికగా ఆమె పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. దీంతో పలువురు నెటిజన్లు స్పందించారు. మరికొందరేమో, ఆమె బ్యాంకు ఖాతాను గుర్తు తెలియని వ్యక్తులు హ్యాక్ చేసి, ఇలా డబ్బులు అడుగుతున్నారని సామాజిక మాధ్యమాల్లో పోస్టుల పెట్టారు. ఈ క్రమంలో రేణు దేశాయ్ వీడియో విడుదల చేశారు. తాను ఆ పోస్ట్ పెట్టడం వెనుక కారణాన్ని వివరించారు. అందరికీ నమస్కారం. కొన్ని రోజుల కిందట నాకు ఫుడ్ పాయిజన్ అయింది. హెల్త్ బాగోలేక వీడియోలు చేయడం లేదు. రూ.3500 కోసం రిక్వెస్ట్ నేనే పెట్టాను.. నా బ్యాంకు ఖాతా హ్యాక్ అవలేదు. విరాళం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. జంతు సంరక్షణ కోసం నేను రెగ్యులర్‌గా విరాళాలు ఇస్తూ ఉంటాను. దేనికి ఎంత విరాళం ఇవ్వాలనే దానిపై నెలవారీ నాకొక బడ్జెట్ ఉంటుంది. దాని ప్రకారం ఇస్తాను. నా దగ్గర ఉన్న మొత్తం డబ్బు ఇచ్చేస్తే, నా కోసం, నా పిల్లలకు ఏమీ మిగలదు. ఇంటి అవసరాలు చూసిన తర్వాత మిగిలితే, అప్పుడే విరాళాలు అందిస్తాను. మీరు నా సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతుంటే మీకు ఆ విషయం తెలుస్తుంది. గత రెండు, మూడు నెలలుగా మాత్రమే విరాళాలు ఇవ్వడం మొదలు పెట్టాను. ఆకలితో బాధపడే చిన్నారుల కోసం, సంరక్షణ అవసరమైన కుక్కలు, పిల్లులు, ఆవులకు సాయం చేస్తా. రాబోయే ఏడాదిన్నరలో షెల్టర్ కట్టేందుకు ప్రయత్నిస్తున్నా. అప్పుడు అధికారికంగా మీ నుంచి విరాళాలు అడుగుతాను. నా బ్యాంకు ఖాతా హ్యాక్ అయిందని మీరు కంగారు పడాల్సిన అవసరం లేదు. మీరు పంపిన డబ్బులు వచ్చాయి. ఆ మొత్తంతో ఏర్పాటు చేసిన ఆహారానికి సంబంధించిన వివరాలను త్వరలోనే పంచుకుంటా' అని రేణు దేశాయ్ అన్నారు.గత కొన్ని రోజులుగా రేణు దేశాయ్ సోషల్ మీడియా నుంచి పెద్దగా అప్‌డేట్స్ లేవు. ఇదే సమయంలో రూ.3500 కావాలని కోరుతూ రేణు దేశాయ్ ఇన్‌స్టా ఖాతాలో ఓ మెసేజ్ పోస్టు అయ్యింది. క్యూఆర్ కోడ్ కూడా షేర్ చేశారు. ఈ పోస్టు చేసిన 5 నిమిషాల్లోనే కొంత మంది అభిమానులు స్పందించారు. వెంటనే డబ్బులు పంపారు. దీంతో ఈ అంశం వైరల్ అయింది.

# ఫెయిల్ అయిన వారికి ఫార్మసీ రిజిస్ట్రేషన్లు

- ఇష్టా రాజ్యంగా రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ లు జారీ
- లంచాల్లో మునిగి తేలుతున్న ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా
- లంచాలు ఇస్తే ఫెయిల్ అయిన వాళ్లు కూడా సర్టిఫికెట్లు జారీ చేస్తున్న వైనం
- పూర్తిస్థాయిలో విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల డిమాండ్







**హైదరాబాదు (ప్రశ్న న్యూస్)** ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విద్యా చట్టం ప్రకారం ఫార్మసీ పరీక్షల్లో అన్ని సబ్జెక్ట్స్ పాస్ ఐన వారికి మాత్రమే, రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నమోదు చేసి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ జారీ చేయాలి. కానీ లంచాలు తీసుకొని కొంతమంది అధికారులు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విద్యా చట్టానికి విరుద్ధంగా, ఫార్మసీ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి కూడా రిజిస్ట్రేషన్ నమోదు చేసి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ లు రిజిస్ట్రార్ జారీ చేసినట్లు ఆరోపిస్తున్నారు. రిజిస్టర్ కనుసైగల్లోనే ఈ అక్రమ దందాలు జరిగాయని భారీ స్థాయిలో నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేను చెప్పిందే వేదం.. చేసిందే చట్టం అంటున్న ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ అంటూ ఉద్యోగుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్లు జారీ చేయడం భారీ స్థాయిలో అవినీతి జరిగిందని పేర్కొన్నారు. రిజిస్ట్రార్,తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ లో ఫార్మసీ విద్య పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి కూడా రిజిస్ట్రేషన్ నమోదు చేసి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ ఇస్తున్న వైనం పై ఆరోగ్యశాఖ మంత్రి స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపించాలని ఇందుకు కారణమైన వారిని ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక విద్యార్థులు ఫార్మసీ కళాశాలలో ఫీజులు కట్టి ఫార్మసీ విద్యను కష్ట పడి చదవడం ఎందుకని ఫెయిల్ అయిన వారికి సర్టిఫికెట్లు జారీ చేసినప్పుడు పాసైన వారి పరిస్థితి ఏమిటని అంటే లంచాలు ఇస్తే అధికారులు ఎలాంటి అవినీతికైనా దిగజారుతారా అని ప్రశ్నిస్తున్నారు.

### ఇక ఫార్మసీ కాలేజీ లు ఎందుకు. ఇక తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ ఎందుకు...

పేద విద్యార్థులు, బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు కష్ట పడి చదువు తుంటే, ఫెయిల్ అయిన వారికి రిజిస్ట్రేషన్ నమోదు చేసి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ ఇస్తున్న రిజిస్ట్రార్ అవినీతి వల్ల పాసైన విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని లంచాలు తీసుకొని రిజిస్టర్ భారీగా అవినీతికి పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.
పేద విద్యార్థులు, బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న రిజిస్ట్రార్ పై కఠిన చర్యలు తీసుకొనిఫార్మసి విద్యా వ్యవస్థను నీరు కారుస్తున్న రిజిస్ట్రార్ ను వెంటనే టెర్మినేట్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై తెలంగాణ గవర్నమెంట్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# పివోకెపై పట్టు కోల్పోయేలా చేసారు

**- నాటి కాంగ్రెస్ తప్పిదాలపై జైశంకర్ ఘాటు విమర్శలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** ఒకరు చేసిన పొరబాటు కారణంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)పై భారత్ తాత్కాలిక నియంత్రణ కోల్పోయిందని విదేశాంగ మంత్రి జై శంకర్ పేర్కొన్నారు. 'విశ్వబంధు భారత్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ హయాంలో జరిగిన తప్పులను ఎత్తిచూపారు. లక్ష్మణ రేఖను దాటి పీవోకేను భారత్ విలీనం చేసుకుంటుందా? అని అడిగిన ప్రశ్నకు.. జై శంకర్ స్పందిస్తూ.. 'లక్ష్మణ రేఖ లాంటివి ఉన్నాయంటే నేను నమ్మను. పీవోకేను భారత్‌లో భాగంగానే భావిస్తున్నా. కొందరి బలహీనత వల్ల అది చేజారింది. పీవోకేపై పట్టు కోల్పోయేందుకు వారి పొరబాటే కారణం అని పరోక్షంగా నెహ్రూను ఉద్దేశించి ఆరోపణలు చేశారు. విశ్వవేదికపై మన స్థానాన్ని బలంగా ఉంచుకోవాలని భావిస్తున్నానని.. స్వీయ విశ్వాసాన్ని ఎన్నడూ వీడకూడదని అన్నారు. పదేళ్లక్రితం ఎవరూ ఇలా మాట్లాడి ఉండకపోవచ్చంటూ కాంగ్రెస్‌పై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. భారత్ విషయంలో చైనా చేపట్టిన చర్యలను ఆ దేశంలో రాయబారిగా ఉన్నప్పుడు గమనించా. ఆ దేశం తీరు మనందరికీ బాగా తెలుసు. అది పాకిస్థాన్‌తో (సీపెక్‌ను ఉద్దేశిస్తూ) కలిసి పని చేస్తోంది. తమది కాని భూభాగాలను ఆక్రమించుకోలేరని ఆ రెండు దేశాలకు చాలాసార్లు స్పష్టంచేశాం. వాటిపై భారత్‌దే హక్కు' అని అన్నారు. పీవోకే విలీనంపై చైనా ప్రతిస్పందనపై అడిగిన ప్రశ్నకు జై శంకర్ ఈవిధంగా స్పందించారు.

# రుణమాఫీ పథకం విధివిధానాలపై కసరత్తు

- ఖరీఫ్ నుండి అమలు అయ్యే పంటల భీమా
- పథకం అమలుపై రైతులు, రైతు సంఘాలతో చర్చలు
- అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** రుణమాఫీ పథకం విధివిధానాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో చర్చించారు. ఖరీఫ్ 2024 నుండి అమలు అయ్యే పంటల భీమా విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు. టెండర్లలో పేర్కొనే నిబంధనలు, ముందుకు వచ్చే కంపెనీలకు ఉన్న అర్హతలు.. మున్నగునవన్నీ ఒకటికి రెండు సార్లు పరిశీలించుకొని, రైతులు పంటనష్టపోయిన సందర్భంలో ఈ భీమా పథకం వారిని ఆదుకొనే విధంగా ఉండాలని మంత్రి తెలిపారు. పథక అమలుకు ఆదర్శ రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను కూడా పరిగణలోనికి తీసుకోవాల్సిందిగా సూచించారు. మరోవైపు.. పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై సరఫరాకు విధివిధానాల రూపకల్పన చేశారు. వెంటనే సరఫరా ప్రారంభించి, సరఫరాలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడగలరని టీఎస్ సీడ్స్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మొదటి విడత పంటనష్ట పరిహారం రూ.15 కోట్లు పంపిణీ పూర్తయినందున, రెండోవిడత ఏప్రిల్ మాసములో, మూడోవిడత మే మాసములో జరిగిన పంట నష్ట వివరాల సమర్పణకు ఆదేశాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే.. మట్టి నమూనా పరీక్షా కేంద్రాల సామర్థ్యం అనుసరించి, వెంటనే రైతుల విజ్ఞప్తి మేరకు అవసరమున్న రైతుల పొలాల మట్టి నమూనాలు సేకరించి ఫలితాలు వచ్చే నెలాఖరులోగా అందచేసేటందుకు ప్రణాళిక చేసుకోవల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. వరి కొయ్యలు కాల్చకుండా యుద్ధప్రాతిపదికన రైతులకు అవగాహన కల్పించడం, అప్పటికీ వినకపోతే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, వరికొయ్యలు తగలపెడితే జరిమానాలు విధించాల్సిందిగా మంత్రి ఆదేశాలు ఇచ్చారు. మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు కొనుగోళ్ళను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేసేవిధంగా ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు.. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ కేటాయించిన భూములలో ఆధునిక సాంకేతికతతో పండ్లతోటల పెంపు మరియు నిర్వహణ బాధ్యతలు తీసుకొనే విధంగా ఆదేశాలు జారీ చేశారు.ఆయిల్ ఫాం కంపెనీల పనితీరు ఆధారంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు.. మల్బరీ సాగుకు అనుకూల ప్రాంతాలను ఎంపిక చేసి పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలలో మ్యాచింగ్ గ్రాంటు బకాయి నిధుల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. అన్ని రకాల సహకార సంఘాలలో సభ్యుల గుర్తింపు మరియు పదవీకాలం ముగిసిన సంఘాల ఎన్నికల నిర్వహణకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు.

# డీఎంహెచ్ఓ లక్ష్మణ్ సింగ్ వ్యవహారం

**- మెడికల్ అధికారిపై సర్వత్రా ఆగ్రహం - కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ -కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన పోలీసులు**



**కామారెడ్డి (ప్రశ్న న్యూస్) :** మహిళ మెడికల్ ఆఫీసర్లను కామారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ లక్ష్మణ్ సింగ్ లైంగిక వేధింపుల ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఈ ఘటనపై సర్వత్రా నిరసనలు వస్తున్నాయి. కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ క్రమంలో డీఎంహెచ్ఓ లక్ష్మణ్ సింగ్ పై దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళా మెడికల్ ఆఫీసర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద 7 కేసులు నమోదు చేసినట్లు కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. తమను ఏడాదిన్నర కాలంగా లైంగికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదులో మహిళ మెడికల్ ఆఫీసర్లు పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ లక్ష్మణ్ సింగ్‌ను దేవునిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కామారెడ్డి డీఎంహెచ్ఓ లక్ష్మణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాది కాలంగా తమను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడంటూ మహిళ మెడికల్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర వైద్య శాఖ అధికారులు విచారణ చేపట్టారు. వివాదాస్పద వ్యాఖ్యలు, వేధింపుల ఘటనపై డీఎంహెచ్ఓపై ఉన్నతాధికారులు సైతం ఫైర్ అయ్యారు. లైంగిక వేధింపుల ఘటనపై డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ అడిషనల్ డైరక్టర్ అమర్ సింగ్ నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఈ విచారణలో తమను లైంగికంగా వేధింపులకు గురి చేశారని 10 మందికి పైగా మహిళా మెడికల్ ఆఫీసర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కామారెడ్డి డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, సూపరింటెండెంట్ శ్రీనునాయక్‌ను బుధవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లక్ష్మణ్ సింగ్, శ్రీనునాయక్‌పై తాజాగా మరికొందరు పీహెచ్‌సీల మహిళా మెడికల్ ఆఫీసర్లు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు అధికారులపై 354, 354 డీ, 509 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, సూపరింటెండెంట్ శ్రీనునాయక్ తనిఖీల పేరిట వస్తూ తమను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారంటూ జిల్లాలోని పలు పీహెచ్‌సీలకు చెందిన 21 మంది మహిళా మెడికల్ ఆఫీసర్లు 10 రోజుల కింద వైద్యారోగ్య శాఖకు ఫిర్యాదు చేశారు. 'పీహెచ్‌సీకి వచ్చినప్పుడు డీఎంహెచ్‌వో పక్కన కూర్చొమనేవారు.. కూర్చోకపోతే పనిలో లోపాలు వెతికి వేధించేవారు. ఫోన్ చేసి మరీ సంసారం జీవితం ఎలా సాగుతుందంటూ అభ్యంతరకరంగా మాట్లాడేవారు' అంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడీహెచ్ అమర్‌సింగ్ నాయక్ బుధవారం కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఇరు వర్గాలను పిలిపించి.. వారితో మాట్లాడారు. విషయం తెలిసి స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అక్కడికి చేరుకోగా.. వేధింపుల విషయాన్ని పలువురు మహిళా ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా విచారణ జరుగుతోందని ఎమ్మెల్యే తప్పుబట్టారు. బాధిత మహిళా ఉద్యోగులతో పాటు మరికొందరు అధికారులూ ఇక్కడికి రావాలన్నారు. డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్‌ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా వీరు ఉద్యోగాల నియామకాలు, డిప్యుటేషన్ల విషయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై స్పందించిన ఏడీహెచ్ అమర్‌సింగ్.. డీఎంహెచ్‌వోతో పాటు ఇతర ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ అంశాన్ని రికార్డు చేశానని, విచారణ నివేదికలో వాటిని పొందుపర్చి.. ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

# తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికపై పార్టీల దృష్టి

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం పోటీ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** తెలంగాణ పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక హడావుడి మొదలైంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ గా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. పోటీ చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈనెల 27 న పోలింగ్ జరగనుండడంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్ రెడ్డి. బిజెపి నుండి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. మొత్తం 52 మంది అభ్యర్థులు పోటీలో అన్నారు. పోలింగ్ కు పది రోజుల సమయం ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. 2021 వ సంవత్సరంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీ అర్ ఎస్ నుండి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. అయితే మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో పల్ల రాజేశ్వర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2021 జరిగిన ఎన్నికల్లో బీ అర్ ఎస్ నుండి పల్లా రాజేశ్వర్ రెడ్డి, బిజెపి నుండి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న పోటీ చేయగా కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెట్టలేదు. 2021 ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్ రెడ్డి, తీన్మార్ మల్లన్న నువ్వానేనా అన్నట్టుగా పోటీ పడగా పల్లా విజయం సాధించారు. ఈ నెల 27 న పోలింగ్ జరగనుండడంతో 10 రోజుల సమయం ఉండడంతో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బీ అర్ ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బిజెపి అభ్యర్థిగా గుజ్జులా ప్రేమేందర్ రెడ్డి తోపాటు 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్న బీ అర్ ఎస్, కాంగ్రెస్ మధ్య పోటి ఉండనుంది. తీన్మార్ మల్లన్న 2021 ఎన్నికల్లో కొద్ది తేడాతో ఓడిపోయారు. ఈ సారి ఓటమి సానుభూతితో పాటు కాంగ్రెస్ అధికారంలో ఉండటం కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. ఇక బీ అర్ ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్ రెడ్డి బిట్స్ ఫీలాని స్టూడెంట్ గా పేరుంది. అంతే కాకుండా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గా పనిచేశారు. అంతే కాకుండా బీ అర్ ఎస్ లో పల్లా వర్గంగా పేరుంది. కాబట్టి పల్లా రాజేశ్వర్ రెడ్డి , రాకేష్ రెడ్డి కోసం తీవ్ర కృషి చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జులా ప్రేమేందర్ రెడ్డి పెద్దగా ప్రభావం చూపెట్టక పోవచ్చు. ఎందుకంటే ప్రేమేందర్ రెడ్డి గత రెండు ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపెట్టలేదు. అంతేకాకుండా బిజెపి నుండి కొంత ఓటింగ్ రాకేష్ రెడ్డికి పోలింగ్ అయ్యే అవకాశం లేకపోలేదు. కాబట్టి పోటీ ఇద్దరి మధ్య ఉందని చెప్పవచ్చు. 2021 ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ ఓటు హక్కును ఐదు లక్షల మందికిపైగా నమోదు చేసుకున్నారు. ఉప ఎన్నికపై ఇతరుల పట్టభద్రులకు పెద్దగా ఆసక్తి లేకపోవడంతో ఓటింగ్ నమోదుకు వెనుకడుగు వేశారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలో 4 లక్షల 27 వేల 289 మంది పట్టభద్రులు మాత్రమే తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. అయితే మూడు జిల్లాల పరిధిలో పట్టబద్రుల సంఖ్య లక్షల్లో ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు చేసుకున్నందుకు పట్టభద్రుల ఆసక్తి చూపలేదని చెప్పవచ్చు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో కూడా ఓటు వేసేందుకు పట్టభద్రులు ఉత్సాహం ప్రదర్శిస్తారా అనేది కూడా చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష బిజెపి పార్టీలు ఛాలెంజ్ గా తీసుకున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో సిట్టింగ్ స్థానాన్ని వదులుకోకూడదని బీఆర్ఎస్. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవడం కోసం తీవ్ర కసరత్తు చేస్తుంది. ఆయా పార్టీల నేతల సైతం ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. దీంతో ఎట్టి పరిస్థితుల్లో పట్టభద్రుల స్థానాన్ని వదులుకోవద్దని రెండు పార్టీలు చూస్తున్నాయి.

# ఢిల్లీ హైకోర్టులో రికవిత లిక్కర్ కేసు విచారణ

**- సిబిఐకి నోటీసులు జారీ చేసిన హైకోర్టు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించిన సీబీఐ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. సీబీఐ కేసులో తన అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఈ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం.. సీబీఐకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ మే24 వాయిదా వేసింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588